ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 18.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 19 జనవరి 2024

జీతాల బకాయిలు ఇప్పించండి

7

» పోలవరంలో పంచాయతీ కార్మికుల ఆవేదన



బైక్ ర్యాలీలో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జడ్పీ చైర్మన్ పద్మశ్రీ, మేయర్ నూర్జహాన్ తదితరులు

ఇంటర్ ప్రీ ఫైనల్స్‌కు.. 'ప్రభుత్వ' అడ్డంకి!

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రైవేటు బస్సుల సేకరణ

» దూరప్రాంత విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం

» నేటినుంచి 25 వరకు ప్రీ-ఫైనల్ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 18 : కీలకమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు సన్నద్ధతగా పరిగణించే ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్న శుక్రవారం తొలిరోజే పలువురు విద్యార్థులు ఈ పరీక్షలకు దూర మయ్యే పరిస్థితులు స్పష్టంగా కనబడుతున్నాయి. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా ప్రజలను తరలించేందుకు ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి పెద్దసంఖ్యలో బస్సులను ప్రభుత్వ మౌఖిక ఆదేశాల మేరకు రవాణాశాఖ సేకరిస్తుండడమే దీనికి కారణ మన్న విమర్శలు వస్తు న్నాయి. ప్రభుత్వ కార్యక్రమానికి విద్యాసంస్థల బస్సులను బలవంతంగా తీసుకోవడం వల్ల పిల్లల పరీక్షలపై తీవ్ర ప్రభావం పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ ప్రీ-ఫైనల్ పరీక్షలు శుక్రవారం నుంచి ఈనెల 25 వరకు జరుగుతాయి. ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో నిర్దీత టైం టేబుల్ ప్రకారం నిర్వహించాల్సిందేనని ఇంటర్ బోర్డు అధికారులు కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో ప్రైవేటు అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు మొత్తం 87 ఉన్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో సైన్స్, ఆర్ట్స్ సబ్జెక్టుల విద్యార్థులు 27,944 మంది, ఒకేషనల్ సబ్జెక్టుల విద్యార్థులు 4501మంది ఉన్నారు. వీరంతా శుక్రవారంనుంచి ప్రారంభమయ్యే ప్రీ-ఫైనల్ పరీక్షలకు హాజరు కావాల్సిఉంది. మరోవైపు థియరీ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సిలబస్‌ను నూరుశాతం పూర్తి చేసేందుకు కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు న్నాయి. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో తమ ప్రతిభా సామర్థ్యాలను/మార్కులను తెలుసుకుని, తదుపరి జరిగే థియరీ పరీక్షల నాటికి లోటుపాట్లను అధిగమించేందుకు ప్రీ-ఫైనల్ పరీక్షలను ఓ కొల మానంగా పరిగణిస్తారు.

200లకు పైగా బస్సుల తరలింపు

జిల్లాలో వున్న ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల నుంచి సుమారు 200లకు పైగా బస్సులు, వాహనాలను విజయవాడ కార్యక్రమం నిమిత్తం రవాణాశాఖ సేకరించినట్టు తెలుస్తోంది. ఈ వాహనాలన్నింటినీ గురువారం సాయంత్రమే తమకు అప్పగించాలని అధికార యంత్రాంగం సూచించింది. కాగా పాఠశాలలకు ఆదివారం వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించిన నేపథ్యంలో విజయవాడ కార్యక్రమానికి బస్సులను పంపేందుకు యాజమాన్యాల నుంచి ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాకపోయినప్పటికీ, ముఖ్యంగా తరగతులు జరుగుతున్న జూనియర్ కళాశాలలు, ఇతర కళాశాలల నుంచి ఒకింత వ్యతిరేకత వచ్చినట్టు సమాచారం. సాధారణంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల్లో అత్యధికులు కనీసం 30 కిలోమీటర్ల పైబడి దూరం నుంచి కళాశాలలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ ప్రకారం శుక్రవారం తరగతులకు హాజరయ్యేందుకు వీరందరిపైనా ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. దీనిపై ఓ ప్రైవేటు కళాశాల ప్రతినిధి మాట్లాడుతూ 'విజయవాడలో నిర్వహించే కార్యక్రమానికి బస్సులన్నింటినీ ఇవ్వాలని రవాణాశాఖ అధికారులు అడిగారు. అన్ని బస్సులను ఇస్తే దూరప్రాంతాల విద్యార్థులు కళాశాలకు రాలేరని చెప్పాం. కనీసం సగం సంఖ్యలోనైనా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. ప్రభుత్వంతో మాకు పనులు ఉంటాయి కనుక ఇవ్వకతప్పలేదు. అందుబాటులోవున్న బస్సులనే ఆయా రూట్లలో ఆపరేట్‌చేసి వీలైనంత ఎక్కువమంది విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చూస్తాం. అయినప్పటికీ కొంతమేర ప్రభావం తప్పదు ' అని వివరించారు. మరోవైపు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ ప్రీ-ఫైనల్ పరీక్షలకు ప్రైవేటు కళాశాలల్లో చదివే దూరప్రాంత విద్యార్థులు హాజరయ్యేందుకు బస్సుల తరలింపు దృష్ట్యా కొంతమేర ప్రభావం తప్పదని యాజమాన్యాలు చెబుతున్నాయి.



100 ఆర్టీసీ బస్సులు

ఏలూరు కలెక్టరేట్ : విజయవాడలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలకు చెందిన 100 బస్సులను కార్యకర్తలను తరలించేందుకు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఆర్టీసీ సంక్రాంతి మూడురోజులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఇబ్బందులు ఎదు ర్కొంది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సులు వేశామని చెప్పినా ఆచరణలో ప్రత్యేక బస్సులు కనిపించలేదు. ఫలితంగా ప్రైవేట్ ట్రావెల్స్‌ను అధిక ధరలు చెల్లించి ప్రయాణాలు సాగించారు. ఇప్పుడు మూడు డిపోల నుంచి 100 బస్సులు పంపించడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు.

సామాజిక సమతా సంకల్ప బైక్ ర్యాలీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 18 : విజయవాడలో 19న అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా సామాజిక సమతా సంకల్ప పేరిట గురువారం నిర్వహించిన బైక్ ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి మొదలైన బైక్ ర్యాలీని మేయర్ షేక్ నూర్జహాన్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, యుడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు పెదబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, దళిత నేతలు పాల్గొన్నారు. పాత బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ర్యాలీ అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.





రిజర్వ్‌డుపై పగ

» నా ఎస్సీ, నాఎస్టీ అంటూనే జగన్ మాయ

» రెండు స్థానాల్లో సిట్టింగ్‌లకు మొండిచేయి

» మరో రెండు స్థానాల్లో కుండమార్పిడి

» గోపాలపురానికి హోం మంత్రి వనిత ట్రాన్స్‌ఫర్

» కొవ్వూరుకు సిట్టింగ్ ఎమ్మెల్యే తలారి బదిలీ

» జనరల్ స్థానాలపై అంతటా కనికరమే

» వైసీపీ అధినాయకత్వం వింత పోకడ.. కేడర్ గగ్గోలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రిజర్వుడు నియోజకవర్గాలపైనే వైసీపీ అధిష్ఠానం ఎందుకో పగ పట్టినట్టుంది. ఈ నాలుగు నియోజకవర్గాల్లో మార్పులు చేర్పులకు పెట్టినంత శ్రద్ధ జనరల్ నియోజకవర్గాలపై కన్నెత్తి చూడటానికి కూడా ఆ పార్టీ భయపడినట్లు కనిపించింది. ఐ ప్యాక్ సర్వే ద్వారా మైనస్ పాయింట్‌లు వచ్చా యంటూ సిట్టింగ్‌లపై మార్పు ప్రయోగం చేసింది. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూనే వైసీపీ అధినాయకత్వంపైకి చెప్పేది ఒకటి లోపల చేసేది ఇంకోటి అన్నట్లు ఆది నుంచి రాజకీయాలు నెరపుతుంది. ఉమ్మడి పశ్చిమలో దీనికి తగ్గట్టుగానే తొలుత చింతలపూడి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాను పక్కన పెట్టి, ఆయన స్థానంలో కె.విజయరాజును సమన్వయకర్తగా, పరోక్షంగా వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా నియమించింది. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఐప్యాక్ సర్వేల పేరిట పక్కనపెట్టారు. కనీసం తన భార్య రాజ్యలక్ష్మికి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని బాలరాజు పదేపదే విన్నవించడం, అక్కడ తగిన అభ్యర్థి లేకపోవడంతో చివరకు అంగీకారం తెలిపి ఆమెను బరిలో నిలపబోతున్నారు.

ఇప్పుడు కుండ మార్పిడి

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలైన గోపాలపురం, కొవ్వూరు ఈసారి వైసీపీ కుండ మార్పిడి పద్ధతి అవలంభించింది. కొవ్వూరులో హోం మంత్రికి ఎదురుగాలి వీస్తుండడంతో ఆమెను తప్పించడమా.. గోపాలపురానికి బదిలీ చేయ డమా ? అనే విషయంలో చానాళ్లు తర్జనభర్జన పడ్డారు. దళిత మహిళ హోం మంత్రి గా ఉండడం, తప్పనిసరి పరిస్థితుల్లో సీటు ఖాళీ చేసేకన్నా ప్రత్యామ్నాయంగా గోపా లపురానికి బదిలీ చేయడమే మేలని భావించారు. తగ్గట్టుగానే గోపాలపురం సిట్టింగ్ ఎమ్మెల్యే తలారి వెంకట్రావును మార్చేది లేదని చెబుతూనే కొవ్వూరు పంపేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సిట్టింగుల మార్పులు, చేర్పులకు సంబంధించి గురువారం పొద్దుపోయిన తర్వాత నిర్ణయం తీసుకున్నారు. ఒక రకంగా అందరూ ఊహించినట్లు గానే ఈ మార్పిడి జరిగింది. వనితకు గోపాలపురంతో ఆది నుంచి సంబంధాలు ఉన్నా యి. తొలుత టీడీపీలో ఈ నియోజకవర్గం నుంచే తన తండ్రి వార సురాలిగా ఎన్నిక య్యారు. వర్గపోరు శ్రుతి మించడం, కొందరు పెద్దలు అంటీ ముట్టనట్లు వ్యవహరిం చడం, ముప్పేట వ్యతిరేకత ఇప్పుడు వనితకు సీటు మార్చేలా చేశాయి.



• 24 గంటల రిలే దీక్షలు ప్రారంభం

ఏలూరు కలెక్టరేట్, జనవరి 18 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 38వ రోజుకు చేరింది. విజయవాడలో జరుగుతున్న దీక్షలకు మద్దతుగా కలెక్టరేట్ వద్ద 24 గంటల రిలే దీక్షలు ప్రారంభించారు. యూని యన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి మాట్లాడుతూ లక్షమంది మహిళలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తుంటే సీఎం జగన్ కనికరం లేకుండా వ్యవహరిస్తు న్నారని విమర్శించారు. హామీలు అమలు చేయమని అడుగుతుంటే మళ్ళీ గెలిస్తే అమలు చేస్తామని చెప్పడం అవకాశవాదానికి నిదర్శనమన్నారు. సమ్మెకు మద్దతుగా సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు జీవీఎల్ నరసింహారావు మద్దతు తెలిపారు. దీక్షల్లో ఎం.మహిమ, సీహెచ్ నాగదుర్గ, డి.జ్యోతి, వై.పద్మ, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి సాయిబాబు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



• చిరస్మరణీయుడు ఎన్టీఆర్

ఏలూరు టూటౌన్, జనవరి 18 : తెలుగుదేశం వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహిం చారు. ఏలూరు టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి చంటి ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. 600 రోజులుగా బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు బీబీజీ తిలక్ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొ న్నారు. కార్యదర్శి పాలి ప్రసాద్, మాజీ మంత్రి మారడాని మంగారావు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, ఉప్పాల జగదీశ్‌బాబు, చోడే వెంకట రత్నం, పూజారి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.



• ఎరక్కపోయి వచ్చి..ఇరుక్కుపోయా..

చింతలపూడి, జనవరి 18 : ఇది చింతలపూడి నగర పంచాయతీలోని మెయిన్ రోడ్డు. స్థానిక ఏరియా ఆస్పత్రి- చింతలపూడి పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద పైపులైను పగలడం వల్ల నీరు రోడ్డుపైకి చేరి క్రమేణ పెద్దగొయ్యి ఏర్పడింది. ఇది జరిగి సుమారు రెండునెలలు గడుస్తున్నా మునిసిపల్ అధికారులు గాని, అటు ఆర్‌అండ్‌బీ అధికారులు గాని పట్టించుకోవడం లేదు. పైపులైనుకు మరమ్మతు చేసి వదిలేశారు. గురువారం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఆ గొయ్యిలో ఇలా ఇరుక్కు పోయింది. గతంలో దీనికి కొద్ది దూరంలోనే రోడ్డు బాగోలేక ప్రమాదం జరిగి ఒకరు చనిపోయారు. అప్పట్లో కలెక్టర్ స్వయంగా పూనుకుని సిమెంటు రోడ్డు వేయించారు. కొత్తబస్టాండ్ వద్ద కూడా ఇటువంటి పెద్ద గొయ్యి ఉంది. మునిసిపల్ అధికారులే ఈ గోతులను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ సిబ్బంది చెబుతున్నారు.

రేపు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 18 : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 20న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షకు ఉమ్మడి జిల్లాలో 24 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు డీఈవో పి.శ్యాంసుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 5,366 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్‌తో ఉదయం 10.30 గంటలకే పరీక్షా కేంద్రా నికి చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన తర్వాత ఒక్క నిమి షం ఆలస్యంగా వచ్చిన అనుమతించబోమన్నారు. సెల్ ఫోన్, చేతిగడియారం, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావద్దని, ఒకవేళ ఈ వస్తువులతో ఎవరైనా పట్టుబడితే సంబంధిత విద్యార్థి పరీక్షను రద్దు చేస్తామని హెచ్చరించారు.

పశుసంవర్ధక సహాయకుల రాత పరీక్షలో జీవన్ కుమార్‌కు మొదటి స్థానం



లింగపాలెం, జనవరి 18 : ఇటీవల జరిగిన ఆంధ్ర ప్రదేశ్ పశుసంవర్ధక సహాయకుల రాత పరీక్షలో లింగపాలెం మండలం పాచ్యానగరానికి చెందిన శ్రీకాకొళ్ళ జీవన్ కుమార్ 82.46 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచాడు. జిల్లాస్థాయిలో టాపర్‌గా నిలువడం తనకెంతో సంతోషంగా ఉందని జీవన్‌కుమార్ తెలిపాడు. తన తల్లిదండ్రులు జయరాజ్ ఫాస్టర్, తల్లి విమల వ్యవసాయకూలీ అని తాను 10వ తరగతి వరకు కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో, అనంతరం చింతలపూడిలో చదివినట్టు తెలిపాడు. ఈ సం దర్భంగా జీవన్‌కుమార్‌ను గ్రామస్థులు అభినందించారు.

ఇసుక బాదుడు

» ర్యాంపుల్లో ధరలు పెంపు

పాలకొల్లు, జనవరి, 18 : ఇసుక అక్రమ ఎగుమతుల ద్వారా కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఇసుక మాఫియా మరింత రెచ్చిపోతోంది. ఇసుక ర్యాంపులలో ఎగుమతుల ధరలు పెంచడానికి రంగం సిద్ధం చేస్తున్నా రు.వందల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ తాడేపల్లికి తరలిస్తున్న పరిస్థితుల్లో మరో దఫా భవన నిర్మాణదారులను నిలువుదోపిడీ చేయడానికి రంగం సిద్ధం చేశారు. ర్యాంపులలో ఇసుక ఎగుమతికి టన్నుకు రూ.475 వసూలు చేస్తున్నారు. ఇప్పుడు అదనంగా ట్రాక్టరుకి రూ.500, 2 లేక 3 యూనిట్ల లారీకి రూ.వెయ్యి 5 యూనిట్లు అయితే రూ.15 వందలు, 6 యూనిట్లకు పైబడిన లారీలకు రూ.2 వేలు అదనంగా వసూలు చేయా లని తాడేపల్లి నుంచి తూర్పు, పశ్చిమ పాత జిల్లా లోని ఇసుక ర్యాంపులకు ఆదేశాలు అందినట్టు తెలిసింది. ఇవి అమలు లోకి వస్తే వినియోగదారులకు మరింత భారం పడుతుం ది. 'ఇప్పటికే టిప్పర్ లారీల మను గడ ప్రశ్నార్థకంగా ఉంది. ర్యాంపులలో ఇసుక ఎగుమతు దారులు పెంచు కుంటూ వెళితే వినియోగ దారులపై మరింత భారం పెరుగుతుంది. ఇప్పుడు 5 యూనిట్ల ఇసుక దూరాన్ని బట్టి రూ.13 వేల నుంచి 14 వేల మధ్య రవాణా చేస్తున్నాం. ర్యాంపులలో పెంచిన ధరలు అమలు చేస్తే 5 యూనిట్ల ఇసుకు రూ.16 వేల నుంచి రూ.17 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది'.. అని గోదావరి క్వారీలారీల ఓనర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు రావూరి రాజా తెలిపారు.

పౌష్టికాహారం ఎలుకల పాలు

» అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లుతున్న గుడ్లు నుంచి దుర్వాసన

» ఇతర ఆహార పదార్థాలపై ముసురుకుంటున్న ఈగలు

ఏలూరు రూరల్, జనవరి 18 : అంగన్‌వాడీలు 38 రోజులుగా సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నారు. గత ఎన్నికల వేళ అక్కాచెల్లెమ్మలు అంటూ ప్రేమ ఒలక పోసిన సీఎం జగన్ ఇప్పుడు అంగన్‌వాడీలను ముప్ప తిప్పలు పెడుతున్నారు. సమ్మెతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడంలో ఇబ్బందులు ఏర్ప డుతున్నాయనే స్పృహ ప్రభుత్వానికి లేకుండా పోయింది. పౌష్టికాహారం ఎలుకల పాలవుతోంది. 38 రోజులుగా సెం టర్లకు గర్భిణులు, బాలింతలు, పిల్లలు రావడం లేదు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఉన్నప్పుడు లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారాన్ని నిర్దేశిత సమయం ప్రకారం అందజేసేవారు. ఇప్పుడు ఆ క్రమం తప్పింది. జిల్లాలో 2,600కు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆ కేంద్రాల్లో మిగిలిన, కొత్తగా వచ్చిన గుడ్లు కుళ్ళి దుర్వాసన వస్తున్నాయి. ఈగలు ముసురుకుంటున్నాయి. కందిపప్పు, బాలసంజీవని, పల్లీల అచ్చులు, ఎలుకలు ఆరగిస్తున్నా యి. గత నెలలో వచ్చిన సరుకులను లబ్ధిదారులకు, అంగ న్‌వాడీలకు అందజేసిన అనంతరం సమ్మెలో దిగారు. 2వ ఫేజ్ సరుకుల పంపిణీ తారుమారు అయింది. కేంద్రా లను కనీసం శుభ్రం చేయడం లేదు. వలంటీర్లు, సిబ్బంది తో కేంద్రం తాళాలను బద్దలు కొట్టించింది. కాని వాటికి కొత్తతాళాలు లేక ప్రస్తుతం అధికశాతం కేంద్రాలకు తాళా లు వేయడం లేదు. కేంద్రాల్లోని ఆటవస్తువులు, ఫర్నీచర్ వంటివి దొంగల పాలవుతాయని అంగన్‌వాడీలు ఆందోళ న చెందుతున్నారు. సొంత డబ్బుతో కొన్న ప్రీ స్కూల్ కిట్లు, ఆటపాట వస్తువులు సెంటర్లో ఉన్నాయని, అవి కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈనెల 15వ తేదీన ఏలూరులో జరిగిన హత్యా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

క్షణికావేశంలో..

» పదిహేను రోజుల్లోనే ఏలూరులో రెండు హత్యలు

» బహిరంగంగా మద్యం తాగడం..

» ఆపై మత్తులో గొడవలు

» గంజాయి విక్రయాల జోరు

» పట్టించుకోని పోలీసులు

ఏలూరు క్రైం, జనవరి 18 : క్షణికావేశంలో హత్యలు జరుగుతున్నాయి. గతంలో ఎంతో కక్ష ఉంటేనే ముందస్తు ప్రణాళిక ప్రకారం హత్యలకు దిగేవారు. నేడు క్షణంలోనే క్షణికావేశానికి లోనై హత్యలకు తెగబడుతున్నారు. ఈ ఏడాది ఏలూరులో గత పదిహేను రోజుల్లో జరిగిన రెండు హత్యలు ఈ కోవకు చెందినవే. జిల్లాలో మద్యం వినియోగం పెరిగింది. మద్యంతో పాటు గంజాయి లభిస్తుండడంతో మత్తులో తూగుతున్నారు. ఇటీవల గంజాయిపై నిఘా కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి. పాత గంజాయి నేరస్తులపై పోలీసు నిఘా లేకపోవడంతో వారు మళ్లీ గంజాయి బాటనే పట్టారని తెలుస్తోంది. అంతేకాకుండా గంజాయి వినియోగదారులే గంజాయి రవాణా దారులుగా మారుతున్న ఘటనలు జిల్లాలో కనిపిస్తున్నాయి.

- మరోవైపు ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యంలో వారికి కావాల్సిన బ్రాండ్లు లేకపోవడం, చీపు క్వాలిటీ మద్యం తాగడంతో వారికి తిక్క ఎక్కడం, ఆ క్షణంలో వారు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 1వ తేదీ ప్రారంభ గడియల్లోనే ఏలూరు పాత బస్టాండ్ సమీపంలో అప్పటి వరకు ఒక బార్‌లో మద్యం తాగిన ఇద్దరు స్నేహి తుల మధ్య మాట మాట పెరిగి క్షణంలో ఒక యువ కుడు మరొకరిని కత్తితో హతమార్చాడు. ఏలూరు అమీనా పేటలో ఈనెల 15వ తేదీ ఉదయం జరిగిన హత్య ఇలాంటిదే. వారిద్దరు స్నేహితులే. అప్పటి వరకు మద్యం, గంజాయి తాగి సరదాగా ఉన్నారు. అదేసమయంలో ఒకరి తల్లిని మరో వ్యక్తి దూషించాడని క్షణికావేశానికిలోనై వెంటనే కర్ర తీసుకుని నెత్తిపై కొట్టడంతో కుప్పకూలి పడ్డాడు. ఈ రెండు హత్యల్లో ముందస్తు కుట్ర లేదు. వారంతా స్నేహితులుగానే ఉన్నారు. కేవలం మద్యం, గంజాయి మత్తు కారణంగానే క్షణాల్లోనే రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.
- నగరంలో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ రోడ్లపైన బహిరంగ మద్యం తాగుతున్నారు. ఉన్నతా ధికారులు ఆదేశాలు ఇచ్చినప్పుడు తప్ప మిగిలినప్పుడు పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరించడంతో మందుబాబులు పెచ్చుమీరిపోతున్నారు. ఎక్కడబడితే అక్కడ బహి రంగంగా మద్యం తాగుతూ ఆ తర్వాత మత్తులో తూగుతూ వాహనాలు నడుపుతున్నారు. డ్రంకెన్ డ్రైవ్ చేపడుతున్నా నగరంలో అంతగా ఫలితమివ్వ డం లేదు. దీంతోనే నగరంలో మందు బాబుల జోరు పెరిగి వివిధ కూడళ్ళల్లో రోజూ గొడవలు, జరుగుతూనే ఉన్నాయి. ఆ రోడ్ల వెంబడి వెళ్లాలంటే ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు నగరంలో మూడు ఉండగా, రూరల్ పరిధికి మరో పోలీస్ స్టేషన్ ఉంది. కాని నగర నడిబొడ్డులోనే మందుబాబులు మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారు. సాయంత్రం అయిందంటే నగరంలో తాగుబోతుల జోరు ఎక్కువవుతుంది. ఇదే విధంగా పరిస్థితులు కొనసాగితే ఇప్పటికే క్షణికావేశంలో గత 15 రోజుల్లోనే రెండు హత్యలు జరుగగా ఏడాది పొడవునా ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయోనన్న భయాందోళనలో నగరవాసులు ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బహిరంగ మద్యం తాగడంపై నియంత్రణ, గంజాయి నిర్మూలన కార్యక్రమాలు చేపడితే నగరం శాంతి భద్రతలు సజావుగా సాగే అవకాశం ఉందని నగరవాసులు పేర్కొంటున్నారు.



శ్రీవారి క్షేత్రంలో సర్వర్ కష్టాలు

» కేశఖండన శాల వద్ద మూడు గంటల పాటు భక్తుల ఇక్కట్లు

7

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

» సింగవరం వద్ద జాతీయ రహదారిపై డ్రైవర్లు, క్లీనర్ల నిరసన

హోరాహోరీగా రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 18 : ఉప్పరగూడెంలో ప్రతీ ఏటా సంక్రాంతికి నిర్వహించే రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు గురువారం రసవత్తరంగా సాగాయి. నెల్లూరు, కృష్ణా, ఏలూరు జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారు 25 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీల్లో విజేతకు రూ.30వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు, మూడో బహుమతిగా రూ.20వేలు, నాలుగో బహుమతికి రూ.10వేలు అందిస్తారు. శుక్రవారం తుదిపోరు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సెమీఫైనల్స్ కృష్ణా జిల్లా, నెల్లూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లా జట్లు తలపడనున్నాయి.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు పెదతాడేపల్లి బ్యాండ్ టీమ్



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 18 : ఢిల్లీలో నిర్వహించే ముందస్తు గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు గురువారం విమానంలో ఢిల్లీ బయల్దేరినట్టు ప్రిన్సిపాల్ బి.రాజారావు తెలిపారు. ఢిల్లీలో ఈనెల 21, 22 తేదీల్లో ధ్యాన్‌చంద్ స్టేడియంలో నిర్వహించే స్కూల్ బ్యాండ్ టీమ్ పోటీల్లో సౌత్‌జోన్ తరపున పాల్గొంటాయని వివరించారు. దేశ రక్షణ, విద్యాశాఖల ఆధ్వర్యంలో దేశ నలుమూలల నుంచి 16 బ్యాండ్ టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. విద్యార్థులకు విమాన టికెట్‌లు ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

21న జిల్లా అదనపు కోర్టు ప్రారంభం


మాట్లాడుతున్న ప్రకాష్‌బాబు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 18: తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో ఈనెల 21న జిల్లా అదనపు కోర్టును ప్రారంభిస్తున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రకాష్‌బాబు తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అదనపు కోర్టు ప్రారంభోత్సవానికి ఏపీ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి శేషసాయి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ భానుమతి, జస్టిస్ సత్తిసుబ్బారెడ్డి, జస్టిస్ వి. గోపాలకృష్ణ హాజరవుతారని వివరించారు. రూ.50 లక్షల పైబడి సివిల్ కేసుల వివాదాలు పరిష్కరించబడతాయని తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు సీట్లు కేటాయించాలి


అప్పిరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న అంబికా కృష్ణ

ఏలూరుటూటౌన్, జనవరి 18:రానున్న ఎన్నికల్లో ప్రతీ రాజకీయ పార్టీ ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని రాష్ట్ర ఆర్యవైశ్య పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అంబికా కృష్ణ అన్నారు. విజయవాడలోని వైసీపీ ప్రధాన కార్యదర్శి యాళ్ళ అప్పిరెడ్డిని కలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే ఆర్యవైశ్య అభ్యర్థుల జాబితాను సమర్పించామన్నారు. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామని అప్పిరెడ్డి తెలిపారన్నారు. అనంతరం గుంటూరులో రాష్ట్ర ఆర్యవైశ్య పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన పాదయాత్రలో పాల్గొన్నారు. కన్యాకపరమేశ్వరి అమ్మవారి గుడి సెంటర్ నుంచి హిమని సెంటర్ వరకు పాదయాత్ర జరిగినట్టు తెలిపారు.

రేపు పాలకొల్లులో ఆక్వా సంఘ 2కే ర్యాలీ

పాలకొల్లు, జనవరి 18 : ఆక్వా రైతు సంక్షోభం నుంచి గట్టెక్కాలనే ఉద్దేశంతో శనివారం పాలకొల్లులో జైభారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం ఆధ్వర్యంలో 2కే ర్యాలీని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, కార్యదర్శి బి.వెంకటనరసయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్వాసాగు మరింత అధ్వానంగా ఉందని, రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. హేచరీల నుంచి నాణ్యమైన సీడ్ లభించడం లేదని, పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. విపత్కర పరిస్థితుల్లో కోల్డ్ స్టోరేజీలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రైతులంతా తీవ్రంగా నష్టపోతు న్నారన్నారు. ప్రాసెసింగ్ ప్లాంట్ ద్వారా రైతులకు సరైన ప్రోత్సాహం లభించడం లేదన్నారు. ఈ మేరకు ఆక్వారైతు సమస్యలను ప్రపంచానికి తెలిపేలా ర్యాలీని చేపడుతున్నామన్నారు. ఈ ర్యాలీ పూలపల్లి వై.జంక్షన్ నుంచి లాకుల మీదుగా గాంధీబొమ్మల సెంటర్‌కు చేరుకుని మెయిన్‌రోడ్డు, పెదగోపురం, కారుమూరివారి వీధి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ర్యాలీ అనంతరం ఆక్వారైతు సమస్యలపై సభను ఏర్పాటు చేశామన్నారు. రైతులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేత 'కాళ్లపాలెం'


కాళ్లపాలెం వెంకటరత్నం జట్టుకు ప్రథమ బహుమతి అందించి సత్కరిస్తున్న సీఐ

కలిదిండి, జనవరి 18 : రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీ ల్లో కాళ్లపాలెం మేడిశెట్టి వెంకటరత్నం జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఆకివీడు లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో రాష్ట్రస్థాయి చెడుగు డు పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానం సాధించిన కాళ్లపాలెం జట్టుకు రూ.25 వేలు నగదు, షీల్డ్‌ను ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ అందజేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, చందన ఉమామహేశ్వరరావు, బొర్రా సత్యవతి, పేటేటి స్వర్ణ కుమారి, రామకృష్ణ జట్టు సభ్యలను గురువారం అభినందించారు.

కొత్తపట్టిసీమ, భీమడోలు సర్పంచ్‌లకు అభినందనలు



కొత్తపట్టిసీమ సర్పంచ్ విజయదుర్గను అభినందిస్తున్న కేంద్ర మంత్రి

పోలవరం, జనవరి 18 : ఏలూరు జిల్లా ప్రతిష్టను కొత్త పట్టిసీమ, భీమడోలు పంచాయతీ సర్పంచ్‌లు పెంచారని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ ఆరోగ్యవంతమైన జాతీయ స్థాయి గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ మేరకు ఏలూరు జిల్లా పోలవరం మండలం కొత్తపట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, భీమడోలు సర్పంచ్ పాము సునీత ఎంపికై పురస్కారం పొందడపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఇద్దరు సర్పంచ్‌లు కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్, రాష్ట్ర మంత్రులు, ఇతర దేశాల ప్రముఖుల సమక్షంలో ఆరోగ్యవంతమైన గ్రామ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు సర్పంచ్‌లకు అభినందనలు తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో సర్వర్ కష్టాలు

▸▸ కేశఖండన శాల వద్ద భక్తుల ఇక్కట్లు

▸▸ మూడు గంటల పాటు అంతరాయం.. అధికారుల తీరుపై ఆగ్రహం


శ్రీవారి కేశఖండనశాల కౌంటర్ వద్ద వేచి వున్న భక్తులు

ద్వారకాతిరుమల, జనవరి 18 : ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి పలు ప్రాంతాల నుంచి మొక్కుబడులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులకు సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం వేలాదిగా తరలివచ్చే ఈ క్షేత్ర కేశ ఖండనశాలలో గురువారం భక్తులకు టికెట్లు ఇచ్చే కౌంటర్‌లో సాంకేతికలోపం ఏర్పడింది. సంక్రాంతి పర్వదినం అనంతరం శ్రీవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆన్‌లైన్ టికెట్లు ఇస్తున్న క్రమంలో ఒక్కసారిగా సర్వర్ ఆగిపోయింది. టికెట్ విక్రయాలు నిలిచి పోవడంతో దాదాపు మూడు గంటల పాటు భక్తులు కౌంటర్ల వద్ద వేచిఉండాల్సి వచ్చింది. సాఫ్ట్‌వేర్ సమస్య అంటూ అక్కడి అధికారులు హడావుడి చేయడమే మినహా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. భక్తులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. చిన్నపిల్లలతో ఎంత సమయం ఎదురు చూడాలంటూ మండిపడ్డారు. అనంతరం సాఫ్ట్‌వేర్‌ను తిరిగి పనిచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. క్యూలైన్లలో కిక్కిరిసిన చంటి బిడ్డల తల్లులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదర్కొన్నారు. చాలాసమయం తరువాత వినియోగంలోకి రావడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. మాన్యువల్‌గా టికెట్లు ఇచ్చే అవకాశం లేదని ఆలయ ఏఈవో పి.నటరాజారావు వివరణ ఇచ్చారు.

నిడమర్రులో విజృంభిస్తున్న విషజ్వరాలు

▸▸ అప్రమత్తమైన వైద్యాధికారుల బృందం


నిడమర్రులో ఫీవర్ సర్వేలో పాల్గొన్న వైద్యాధికారులు

నిడమర్రు జనవరి 18 : నిడమర్రులో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మేజర్ పంచాయతీ నిడమర్రులో పారిశుధ్యం లోపించడంతో మురుగునీరు పోయే మార్గాలు స్తంభించడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల బెడదతో రోజురోజుకు జ్వరాల భారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. పెదనింద్రకొలను పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో విజృంభిస్తున్న విషజ్వరాలపై స్పందించిన డీఎంహెచ్‌వో నాగేశ్వరరావు బుధవారం సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా వైద్యాధికారుల బృందం ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహిస్తుందని, ఇప్పటివరకు ఆరు జ్వర కేసులు గుర్తించామని వారికి డెంగీ టెస్టులు నిర్వహించగా నెగిటివ్ వచ్చాయన్నారు. సాధారణ జ్వర కేసులను రోజువారి పరీక్షలు నిర్వహించి వైద్య బృందం పర్యవేక్షణలో ఉంచామన్నారు. పంచాయతీ సిబ్బందిని గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు బ్లీచింగ్ చల్లించాలని సూచించామన్నారు. ఎవరికైనా జ్వరాలు వస్తే వెంటనే ఆశా కార్యకర్తలను, సచివాలయ వైద్య సిబ్బందిని సంప్రదించి మెరుగైన వైద్యం పొందాలని సూచిస్తున్నామన్నారు. కార్యక్రమం ఎంపీహెచ్‌వో కృపావరం, వైద్యధికారులు పాల్గొన్నారు.

రేపు మొగల్తూరులో ఉచిత వైద్య శిబిరం

▸▸ కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి



మొగల్తూరు, జనవరి 18 : కేంద్ర మాజీ మంత్రి, దివంగత యూవీ కృష్ణంరాజు జయంతి పురస్కరించుకుని 20వ తేదీన మొగల్తూరులో షుగర్, గ్యాంగ్రీన్ వ్యాధులకు సంబంధించి మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సొంతూరు మొగల్తూరు అంటే కృష్ణంరాజుకు ఎంతో మమకారంతో ఉండేవారన్నారు. ఆయన జయంతి పురస్కరించుకుని పేదలకు అందని ఎంతో వ్యయంతో కూడిన షుగర్ వ్యాధి కారణంగా వచ్చే గ్యాంగ్రీన్ అనే వ్యాధి సోకినవారికి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లండన్‌కు చెందిన ప్రముఖ గ్యాంగ్రీన్ వైద్య నిపుణుడు కవర్తపు వేణు కృష్ణంరాజుపై ఉన్న అభిమానంతో వైద్య సేవలందించేందుకు ప్రత్యేకంగా వస్తున్నారన్నారు. లండన్, అబుదాబి, హైదరాబాద్, విజయవాడ, భీమవరానికి చెందిన 30మంది ప్రముఖ వైద్యులు సేవలందిస్తారన్నారు. తమ కుటుంబ వారసుడు హీరో ప్రభాస్, తమ కుమార్తెలు కృష్ణంరాజు పేరిట విద్య, వైద్య సేవలందించేందుకు సహకరిస్తున్నారన్నారు. ఈ శిబిరంలో వైద్య సేవలు పొందేవారు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. సమావేశంలో దాసరి బాబి, గ్రామీణ వైద్య సంఘ నాయకులు కేఎస్‌వీఎన్ ముక్తేశ్వరరావు, సీహెచ్‌వీపీ శ్రీనివాస ప్రసాద్, పులపర్తి రమేష్, సత్యనారాయణ తదితరులున్నారు.

కృష్ణంరాజు లేకుండా సొంతూరు రావడం బాధిస్తోంది..

తన భర్త కృష్ణంరాజు లేకుండా సొంతూరు మొగల్తూరుకు రావడం ఎంతో బాధ కలిగిస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆమెను కలిసిన మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుతో మాట్లాడారు. గ్యాంగ్రీన్ ఆపరేషన్‌కు సుమారు రూ.50 లక్షలు వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని ప్రతీ ఏటా ఉచితంగా ఈ రకమైన వైద్య సేవలందించేందుకు తమ కుటుంబం నిర్ణయం తీసుకుందని మాధవనాయుడుకు ఆమె తెలిపారు.

క్రైం కార్నర్

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ..

▸▸ ప్రయాణికుడి దుర్మరణం


లారీని ఢీకొని బోల్తాపడ్డ లారీ

మొగల్తూరు, జనవరి 18 : మొగల్తూరు హైవేపై నల్లంవారితోట సమీపంలో ఆగి వున్న లారీని మరో లారీ ఢీకొనడంతో అందులోని ప్రయాణికుడు మృతి చెందాడని ఏఎస్‌ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. కృష్ణాజిల్లా ఘంటశాల మండలం శ్రీకాకుళం నుంచి తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం వెళుతున్న ధాన్యం లోడు లారీ మొగల్తూరు జాతీయ రహదారిపై ఆగి వున్న లారీని గురువారం వేకువజామున ఢీకొని బోదెలో బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలో ప్రయాణిస్తున్న మాదాసు నాగబాబు (38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి వరుసకు సోదరుడైన సీతా రాంబాబు మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరి మృతి

దెందులూరు, జనవరి 18 : బిల్డింగ్‌పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. శ్రీరామవరానికి చెందిన బొర్రా శేషయ్య కుమారుడు రవి(30)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. మృతుడికి రెండేళ్ల బాబు ఉండగా, నెలరోజుల క్రితం మరో బాబు జన్మించాడు. బుధవారం రాత్రి గాలి సక్రమంగా రావడం లేదని బిల్డింగ్‌పై పడుకుందామని రాత్రి 11 గంటల సమయంలో పైకి ఎక్కి పడుకున్నాడు. ఉదయం లేచి తండ్రి చూసే సమయానికి రవి కింద పడి తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. తెల్లవారుజామున మంచినీళ్ల కోసం లేచి రక్షణ గోడ లేకపోవడం వల్ల నిద్ర మత్తులో కిందపడి ఉండొచ్చని అనుకుంటున్నారు. మృతదేహం వద్ద భార్య రెండేళ్ల బాబు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాధచాయలు నెలకొన్నాయి.

దూసుకొచ్చిన కారు... తప్పిన పెనుప్రమాదం


వినాయక పాదాల వద్ద ఢీకొట్టిన కారు

ఆకివీడు, జనవరి 18: ఓ యువకుడు బుధవారం కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న సమయంలో బ్రేకుకు బదులు ఎక్స్‌లేటర్ నొక్కడంతో రోడ్డుమీద నుంచి శాంతినగర్ వరసిద్ధి వినాయక దేవాలయంలోకి గేటును ఢీకొట్టి దూసుకొచ్చింది. భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక పాదాలను ఢీకొట్టడంతో ఆ ప్రాంతంలోని వస్తువులు విరిగిపోయా యి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కారు ఎదర భాగంగా పూర్తిగా దెబ్బతినడంతోపాటు భక్తులు కూర్చునే బల్లలు, పాదాల దగ్గర సిమెంట్ గోడలు దెబ్బతిన్నాయి. ఆలయంలో మరమ్మతులు చేయిస్తాననడంతో యువకుడు చెప్పడంతో వివాదం సద్దుమనిగింది.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

పోలవరం, జనవరి 18 : మోటారు బైక్‌ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు కార్మికులకు స్వల్పగాయాలైన ఘటన గురువారం పోలవరంలో జరిగింది. స్థానిక ఏటిగట్టు సెంటర్‌లోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో పోలవరం ప్రాజెక్టు కార్మికులు ఇద్దరు బైకుపై పోలవరం ప్రాజెక్టు వైపు వెళుతుండగా తహసీల్దార్ కార్యాలయం వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో బైక్‌నుంచి ఇద్దరు కార్మికులు కింద పడిపోయారు. అదే సమయంలో ఎన్టీఆర్ వర్ధంతి జరుపుతున్న స్థానిక టీడీపీ మండల నాయకులు గాయాలపాలైన వారికి సహాయక చర్యలందించి ఆస్పత్రికి పంపించారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున అధికారుల స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అశ్లీల డ్యాన్స్‌లు..

యలమంచిలి, జనవరి 18: సంక్రాంతి పండుగ సందర్భంగా యలమంచిలి, ఆచంట మండలాల సరిహద్దు ప్రాంతంలో అశ్లీలంగా, అసభ్యకరమైన రికార్డింగ్ డాన్స్‌లు జరిగాయి. అర్ధరాత్రి సమయంలో విచ్చలవిడిగా మహిళలతో అశ్లీలంగా డ్యాన్స్‌లు నిర్వహించారు. రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో నిర్వాహకులు బరితెగించారని సమాచారం. ఈ అసభ్యకరమైన డ్యాన్స్‌లు జరిగిన ప్రాంతం ఏ మండలం పరిధిలోకి వస్తుందో తేల్చడంపై పలువురు అధికారులు కసరత్తు చేస్తున్నారని తెలిసింది.

బాలుడిపై పాస్టర్ దాడి.. కేసు నమోదు

ఆగిరిపల్లి, జనవరి 18: ఆడుకొంటున్న ఓ బాలుడిని పాస్టర్ గాయపరిచినట్టు అందిన ఫిర్యాదుపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. ఈదులగూడెంకు చెందిన ఐయ్యంకి జోయల్‌బాబు(12) స్నేహితులతో కలిసి ఆర్సీఎం చర్చి వద్ద ఖాళీ స్థలంలో వాలీబాల్ ఆడుకుంటున్నాడు. బాలు తీసుకొచ్చేందుకు సమీపంలో చెట్టుకు కట్టేసిఉన్న పాస్టర్ మన్నెం శరత్ పెంపుడుకుక్క దగ్గరకు వెళ్లాడు. పాస్టర్ రాళ్లు విసరగా స్నేహితులంతా పారిపోయారు. సైకిల్ తెచ్చుకునేందుకు వెళ్లిన జోయల్‌బాబును పాస్టర్ కర్రతో కుడిచేతిపై బలంగా కొట్టడంతో గాయపడ్డాడు. బాధితుడి తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్టు ఎస్ఐ చంటిబాబు తెలిపారు. నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతున్నాడు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 18 : చేపల చెరువుకు అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్నారని ట్రాన్స్‌కో విజిలెన్సు అధికారులకు సమాచారం అందడంతో గురువారం తనిఖీలు చేపట్టారు. దెందులూరు మండలం సత్యనారాయణపురం గ్రామంలో చేపల చెరువుకు ఉన్న విద్యుత్ కనెక్షన్లను ఏలూరు రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.శ్రీనివాస్, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి, విజిలెన్స్ అండ్ ట్రాన్స్‌కో ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ చేపల చెరువు యజమానిపై కేసు నమోదు చేసి రూ.1,13,313 అపరాధ రుసుము, ఎనిమిది వేల రూపాయల జరిమానా విధించారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ట్రాన్స్‌కో ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

కేపీపాలెం తీరంలో దొంగల దోపిడీ

మొగల్తూరు, జనవరి 18 : కేపీపాలెం తీర గ్రామాల్లో రెండు గృహాల్లో దొంగలు దోపిడీకి పాల్పడినట్టు తెలిసింది. కేపీపాలెం నార్త్ పంచాయతీ తెన్నేటివారిపేటకు చెందిన వ్యక్తి అదే ప్రాంతంలో భవనం నిర్మించుకున్నాడు. ఇంటి యజమాని జీవనోపాధికై కువైట్‌లో ఉంటుండగా అతడి భార్య రెండు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లడంతో ఇల్లు తాళం వేసి ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు తలుపులు పగులకొట్టి సుమారు రూ.3.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తస్కరించినట్టు తెలిసింది. అదేవిధంగా కేపీపాలెం సౌత్‌లో ఒక గృహ యజమాని.. తన భార్యతో కలిసి అమెరికాలో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లడంతో ఆ ఇల్లు తాళం వేసి ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు బుధవారం రాత్రి సమయంలో ఆ గృహం తలుపులు పగుల కొట్టి వెండి వస్తువులు దొంగిలించినట్టు సమాచారం. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ఆన్‌లైన్ మోసం

▸▸ జంగారెడ్డిగూడెంలో రూ.66,500 మోసపోయిన మహిళ

జంగారెడ్డిగూడెం, జనవరి 18 : ఆన్‌లైన్ మోసానికి మరో మహిళ నష్టపోయింది. ట్రైనీ డీఎస్పీ విద్య తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఓ మహిళకు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో గత ఏడాది డిసెంబరులో అమెజాన్ షాపింగ్ స్టోర్ లింక్ వచ్చింది. పార్ట్ టైం ఉద్యోగమని, అధిక ఆదాయం సంపాదించవచ్చని లింక్‌లో పేర్కొనడంతో లింక్‌ను క్లిక్ చేసిందన్నారు. స్టోర్ ద్వారా వస్తువులను కొనుగోలు చేసి అమ్మకాలు చేయాల్సి ఉంటుందని తెలపడంతో వారు పేర్కొన్న టాస్కులను పూర్తిచేసి, వస్తువుల కొనుగోలుకు దఫదఫాలుగా రూ.66,500 నగదును లింక్‌లో పేర్కొన్న యాప్‌కు మహిళ పంపిందన్నారు. ఎన్ని రోజులైనా జమచేసిన నగదు విత్‌డ్రా కాకపోవడంతో సదరు మహిళ తాను మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

బిర్యాని పాయింట్ యజమానిపై కేసు

▸▸ 23 గ్యాస్ సిలిండర్లు సీజ్


జంగారెడ్డిగూడెంలో సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లు

జంగారెడ్డిగూడెం, జనవరి 18 : వాణిజ్య అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాలతో జంగారెడ్డిగూడెం పట్టణంలోని ముబాకర్ కచ్చా బిర్యానీ పాయింట్‌లో గురువారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.61,120 విలువ చేసే 23 గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను గుర్తించి సీజ్ చేసి బిర్యాని పాయింట్ యజమాని షేక్ అబ్దుల్ వాహెబ్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, సివిల్ సప్లైస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి, రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు.


భీమడోలు హైస్కూలులో ఘర్షణకు దిగిన యువకులు

'ఆడుదాం ఆంధ్రా'లో కొట్లాట

భీమడోలు, జనవరి 18 : భీమడోలు హైస్కూలులో జరుగుతున్న క్రీడా పోటీల్లో గురువారం ఘర్షణ వాతావరణం నెలకొంది. పోటీల్లో భాగంగా హైస్కూలు గ్రౌండ్‌లో కబడ్డీ పోటీల్లో ఆగడాలలంక, పూళ్ళ జట్లు తలపడ్డాయి. పూళ్ళ జట్టు విజయం సాధించింది. ఈ క్రమంలో ఓడిపోయిన ఆగడాలలంక జట్టు క్రీడాకారులు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కొంతమంది బయట యువకులు పరస్పర దాడులకు దిగారు. హైస్కూలు ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. దీనిపై సోషల్ మీడియాలో క్రీడాకారులు కొట్టుకుని అంపైర్‌పై దాడి చేశారని ప్రచారం జరిగింది.

● బయట వ్యక్తులే కొట్టుకున్నారు..

భీమడోలు హైస్కూలులో కబడ్డీ పోటీల్లో క్రీడాకారుల మధ్య ఎటువంటి కొట్లాట జరుగలేదని అంపైర్‌పై కూడా దాడి చేయలేదని ఎంపీడీవో పద్మావతితో పాటు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. సోషల్ మీడియా ఇతర సమాచార మాధ్యమాల్లో జరిగిన ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఆగడాలలంకకు చెందిన పంతగాని అక్బర్ అనే వ్యక్తి తమ జట్టు ఓడిపోయిన కారణంగా కొంతమందిపై దుర్భాషలు ఆడడంతో వివాదం మొదలైందని.. దీనిలో క్రీడాకారుల ప్రమేయం లేదన్నారు. అక్బర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

▸▸ జాతీయ రహదారిపై డ్రైవర్లు, క్లీనర్ల నిరసన


సింగవరం వద్ద డ్రైవర్లు, క్లీనర్ల నిరసన

దెందులూరు,జనవరి 18 : డ్రైవర్లు, క్లీనర్లను ఇబ్బందులకు గురిచేసే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం ప్రకారం శిక్షా కాలాన్ని పెంచడాన్ని నిరసిస్తూ భీమడోలుకు చెందిన జయహో రథసారధి డ్రైవర్ల, క్లీనర్ల యూనియన్ నాయకులు సమ్మెకు దిగారు. గురువారం గుండుగొలను సమీపంలోని సింగవరం జాతీయ రహదారిపై వాహనాలను నిలుపుదల చేసి జీవోను వెంటనే రద్దు చేయాలని నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఈ కొత్త చట్టం వల్ల డ్రైవర్లు ప్రమాదం చేసి పారిపోయినందుకు పదేళ్ల శిక్ష విధించబడుతుందని, అంతకు ముందు నిందితుడికి రెండేళ్ల వరకు మాత్రమే శిక్ష ఉండేదన్నారు. హైవేపై ట్రాఫిక్ పెద్దఎత్తున నిలిచిపోయింది. దెందులూరు ఎస్ఐ స్వామి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా యూనియన్ నాయకులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జయహో రథసారధి డ్రైవర్ల, క్లీనర్ల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా యోగి వేమన జయంతి


యోగి వేమను చిత్రపటాలను అందుకుంటున్న దర్శక, నిర్మాతలు కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి

అత్తిలి, జనవరి 18: ప్రజాకవి శ్రీయోగి వేమనకు ఆరవల్లి గ్రామంలో మందిరం నిర్మించి ప్రతీ ఏడాది మాదిరిగా జనవరి 18న జయంతిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయంనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేమనను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కీర్తనలు, కోలాటం, సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై వేమన చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. వేమన పల్లకి కింద నుంచి తల్లిదండ్రులు తమ చిన్నారులను దాటించారు. ఈవిధంగా చేయడం వల్ల పిల్లలకు ఆయుష్షు పెరుగుతుందని గ్రామస్థుల నమ్మకం. ఆలయ కమిటీ ఛైర్మన్ వెలగల అమ్మిరెడ్డి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆరవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సినీ దర్శకుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శునకాలకు అన్నదానం చేశారు.

వెంకటకృష్ణాపురంలో భూవివాదం

▸▸ ఇరువర్గాలు పరస్పరం ఒకరిపై మరొకరి దాడి

▸▸ ఏలూరు ఆస్పత్రికి తరలింపు

ద్వారకాతిరుమల, జనవరి 18 :భూవివాదం నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పరం ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్న ఘటనలో ఐదుగురు వ్యక్తులు తీవ్రగాయాలపాలైన ఘటన వెంకటకృష్ణాపురంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటకు చెందిన గోపా నాగేశ్వరరావుకు వెంకటకృష్ణాపురానికి చెందిన పాకలపాటి రామ్మోహనరావు కుమారులకు గ్రామంలోని 107 సర్వే నంబరు భూమిపై తగాదాలున్నాయి. ఇందుకు సంబంధించి కోర్టులో వ్యాజ్యం నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం రెండు వర్గాల వారు భూమి తమదంటే తమదని కర్రలతో దాడి చేసుకున్నారు. గోపా నాగేశ్వరరావు, గోపా వెంకటేశ్వరరావు, గోపా బాలబాలాజీ, గోపా సత్యన్నారాయణ, గదుల సత్యన్నారాయణలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని ముందుగా స్థానిక పీహెచ్‌సీకి ప్రథమ చికిత్స నిమిత్తం అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తరలించారు.

జామాయిల్ ట్రాక్టర్ బోల్తా- వ్యక్తికి గాయాలు

చాట్రాయి, జనవరి 18: జామాయిల్ కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ గురువారం రాత్రి చాట్రాయి ఊరచెరువు దగ్గర బోల్తా పడడంతో కర్రలు మీదపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి. పామాయిల్ కర్రల లోడుతో ట్రాక్టర్ చాట్రాయి వైపు వస్తుండగా, అదే సమయంలో బచ్చు శరణ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఆరుగొలనుపేట వెళుతున్నాడు. ట్రాక్టర్ బోల్తాకొట్టి కర్రలు అతడిపై పడ్డాయి. వెంటనే స్థానికులు స్పందించి కర్రలు తొలిగించి అతడిని బయటకు తీసి 108లో నూజివీడు ఆసుపత్రికి తరలించారు.పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు కర్రలు తగలడంతో సరఫరా నిలిచిపోగా ఆ తరువాత పునరుద్ధరించారు. ట్రాఫిక్ నిలిచిపోవటంతో ఎస్ఐ కేసీహెచ్.స్వామి సిబ్బందితో వచ్చి క్లియర్ చేశారు.

జీతాల బకాయిలు ఇప్పించండి

▸▸ పంచాయతీ కార్మికుల ఆవేదన

▸▸ కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని వైనం


పోలవరం పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన (ఫైల్)

పోలవరం, జనవరి 18 : దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదన్న సామెతలా ఉంది పంచాయతీ కార్మికులు పరిస్థితి. పంచాయతీ కార్మికుల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని పంచాయతీ కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం పంచాయతీ కార్మికులు తమ జీతాల పెంపు కోసం, ఉద్యోగ భద్రత కోసం చేసిన సమ్మె కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉద్యోగ భద్రత, జీతాల పెంపు విషయంలో నిర్దిష్ట హామీ ఇవ్వకపోయినా కార్మికులకు మద్దతుగా పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో కార్మికులు తమ జీతాల బకాయిలు నెలల తరబడి పెండింగ్ ఉం టున్నాయంటూ అప్పులు చేసి బతుకు వెళ్లదీయాల్సి వస్తుందంటూ కలెక్టర్‌కి మొరపెట్టుకోవడంతో జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు, సర్పంచులు జీతాల బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంక్రాంతి పండుగలో సైతం అప్పులు చేసుకుని పండుగ పూట పొట్టగడుపుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పండుగ రోజుల్లో తమతో విధులు చేయించారన్నారు. ఇప్పటికైనా జీతాల బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.


మాల మహాసేన కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నేతలు

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదు

ఏలూరు టూటౌన్, జనవరి 18: బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదని మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు అలగా రవికుమార్ అన్నారు. మాల మహాసేన కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ దళితులను దారుణంగా మోసం చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన 27 దళిత సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. వాటిని తిరిగి ప్రారంభిస్తేనే జగన్‌కు విగ్రహాన్ని ప్రారంభించే అర్హత ఉందన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పేరును తొలగించి జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చుకుని అహంకారాన్ని చాటుకున్నాడన్నారు. కార్యక్రమంలో ఏడుకొండలు, పెద్దిరాజు, ఎన్.శంకర్, కె.దిలీప్, బద్రి, కే.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

26న ఆవిష్కరిస్తే అంబేడ్కర్‌కు గౌరవం

జంగారెడ్డిగూడెం, జనవరి 18: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గణతంత్ర దినోత్సవమైన 26న ఆవిష్కరిస్తే ఉంటే అంబేడ్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని గౌరవించినట్లు ఉండేదని టీడీపీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్ కుమార్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19న అంబేడ్కర్ విగ్రహాన్ని ఎందుకు ఆవిష్కరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అమరావతిలో 100 ఎకరాల అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేసి, 125 అడుగుల విగ్రహం ఏర్పాట్లకు చర్యలు చేపట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడ స్వరాజ్ మైదానానికి తరలించిందని, గత ప్రభుత్వం కేటాయించిన స్మృతి వనం 100 ఎకరాల భూమి ఏమైందని ఆయన ప్రశ్నించారు. విదేశీ విద్య పథకానికి అంబేడ్కర్ పేరు తొలగించారని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.75వేల కోట్లు దారి మళ్లించారని, ప్రశ్నించిన దళితులను ఊచకోత కోశారని, తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసినా ప్రశ్నించలేని అంబేడ్కర్ భావజాలం ప్రచారకులు నేడు అత్యుత్సాహం ప్రదర్శించడం బాధాకరమన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించాలి


మాట్లాడుతున్న వివేక్ ఠాకూర్

ఉంగుటూరు, జనవరి 18: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రాష్ట్ర ఇన్‌చార్జి, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ వివేక్ ఠాకూర్ అన్నారు. ఉంగుటూరులో వికసిత్ భారత్‌పై జిల్లా అధికారులతో గురువారం ఆయన చర్చించారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, ఆర్డీవో షేక్ ఖాజావలి, డిప్యూటీ సీఈవో జ్యోతి, డ్వామా పీడీ ఎ.రాము, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నందిపాటి ప్రేమాన్విత, బీజేపీ నేత అడపా శోభారాణి, తదితరులు కేంద్ర పథకాల పోస్టర్లను ఆవిష్కరించారు.

ఉపాధి హామీతో రైతులకు ప్రయోజనం

లింగపాలెం, జనవరి 18: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందని కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ఎస్ఎస్ చక్రధరరావు అన్నారు. అన్నపనేనివారిగూడెం, పాశ్వానగరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను అందజేశారు. ఏ ఆసుపత్రిలోనైనా రూ.5లక్షల వరకు ఉచితవైద్యం పొందే అవకాశం ఉందన్నారు. పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ మురళీకృష్ణ, ఏడీఏ బండారు నాగకుమార్, ఏవో మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

మెప్మా ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న మెప్మా సిబ్బంది

ఏలూరు క్రైం / టూటౌన్, జనవరి 18: అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ సందర్భంగా సమతా సంకల్ప కార్యక్రమాలలో మెప్మా ఉద్యోగులు 20 మంది రక్తదానం చేశారు. కలెక్టరేట్ ఆవరణలోని గిరిజన భవనంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీకృష్ణారెడ్డి తెలిపారు. మెప్మా పీడీ ఇమ్మానియేలు కూడా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ఉద్యోగులను ఆయన అభినందించారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి సీతారామ్, మెడికల్ ఆఫీసర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, పీఆర్వో కెవి రమణ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరులో టీడీపీ శ్రేణుల రక్తదానం

ఉంగుటూరు, జనవరి 18: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు గురువారం రక్తదానం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో వివిధ మండలాల నాయకులు వేగేశ్న రంగరాజు చింతల శ్రీనివాస్, విజయకుమార్, రెడ్డి చందు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు


లారీ డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జనవరి 18 : జిల్లా వ్యాప్తంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, సబ్ డివిజన్ల పరిధితోపాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు వాహనదారులతో ఫేస్‌వాష్ కార్యక్రమం నిర్వహించారు. ప్రార్థనాలయాలు, బ్యాంక్ ఏటీఎంల వద్ద రాత్రి పూట పోలీసులు గస్తీ నిర్వహించి వాచ్‌మన్‌ను అప్రమత్తం చేశారు. వాహనాలలో గంజాయి, సారా, ఖైనీ, గుట్కాలు అక్రమ రవాణా జరుగకుండా జాతీయ, రాష్ట్రీయ రహదారులు ఇతర రహదారుల్లో తనిఖీ నిర్వహించారు.

శాస్త్రవేత్త చిరంజీవి శ్రీనివాస్‌కు స్వగ్రామంలో సత్కారం


చిరంజీవి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు

ఉంగుటూరు, జనవరి 18: మారుమూల పల్లె నుంచి శాస్త్రవేత్తగా ఎదిగిన నారాయణపురం గ్రామానికి చెందిన వూసా చిరంజీవి శ్రీనివాస్‌ను గ్రామస్థులు గురువారం సత్కరించారు. పేదల విద్యాభివృద్ధి కోసం చింతలపాటి వర ప్రసాద మూర్తిరాజు స్థాపించిన పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించిన ఉన్నత స్థాయికి ఎదిగిన నిరుపేద కుటుంబానికి చెందిన వూసా చిరంజీవి శ్రీనివాసరావు విద్యార్థులకు ఆదర్శమని సర్పంచ్ దిడ్ల అలకనంద అన్నారు. చెమట ద్వారా షుగర్ స్థాయి తెలుసుకునే పరికరం రూపొందించిన చిరంజీవి శ్రీనివాస్‌ను సర్పంచ్, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొమ్మిడి అప్పారావు, పాతూరి వీర వెంకట సత్యనారాయణ, పుసులూరి సూర్యప్రకాష్, కైకరం సర్పంచ్ సలగాల గోపి, నల్లా ఆనంద్, దిడ్ల శ్రీనివాస్ తదితరులు చిరంజీవి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

సాయి నాథుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 18: ఆదివారపుపేట షిరిడీ సాయి మందిర్‌లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి హారతులు ఇచ్చారు. భారీ సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. 12 పంపుల సెంటర్, పత్తేబాద, ఆర్ఆర్ పేట, రామానగర్ కాలనీ, దక్షిణపువీధి సాయి మందిరాల్లో పూజలు చేశారు.

22న కోదండ రామాలయం వద్ద పూజలు

ఏలూరుకార్పొరేషన్, జనవరి 18: అగ్రహారంలోని రామమందిరం వద్ద హిందూ సంఘాల జేఏసీ, అంబికా గ్రూపు సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో 22న విశేష పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అయోధ్యలో రామమందిర్ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహా హారతి, భక్తులందరికీ భద్రాద్రి రాముని ప్రసాద వితరణ జరుగుతుందని కార్యాచరణ సమితి సభ్యులు తెలియజేశారు.


ఏలూరులో నివాళులర్పిస్తున్న చింతమనేని, నేతలు


జంగారెడ్డిగూడెం పట్టణంలో..


దెందులూరు మండలం పోతునూరులో..


చింతలపూడిలో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

వర్ధంతి కార్యక్రమాల్లో నేతలు, కార్యకర్తల నివాళి


వెల్లమిల్లిలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

జంగారెడ్డిగూడెం, జనవరి 18: ఎన్టీ రామారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటారని పలువురు వక్తలు అన్నారు. జిల్లాలో పలుచోట్ల ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ కృష్ణ, మండవ లక్ష్మణరావు, రావూరి కృష్ణ తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి నివాళులరించారు. 23వ వార్డులో మాజీ పట్టణ అధ్యక్షుడు షేక్ ముస్తఫా, తూటికుంట దుర్గారావు, బైపాస్‌లో చెరుకూరు శ్రీధర్, సంత మార్కెట్‌లో చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, మార్కండేయపురం, ఎన్టీఆర్ నగర్, బుట్టాయిగూడెం రోడ్‌లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూల దండలు వేసి ఘననివాళులర్పించారు. తూటికుంట రాము, నంబూరి రామచంద్రరాజు, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, ఆకుమర్తి రామారావు, కొంచాడ ఉమాప్రసాద్, తెలగారపు జ్యోతి, రాజాన సత్యనారాయణ, పగడం సౌభాగ్య వతి, గుళ్ళపూడి శ్రీదేవి పాల్గొన్నారు. లక్కవరంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, బిస్కట్లు పంపిణీ చేశారు.

- పెదపాడు: పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని గుత్తా అనిల్ అన్నారు. కొణికి సర్పంచ్ పొట్లూరి యుగంధర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి గజమాల వేసి నివాళులర్పించారు. ఉప్పలపాటి రాంప్రసాద్, మోరు దశరథ్, గంపా రాంబ్రహ్మం, లావేటి హేమసుందర్, గంపా వంశీ, పండు, చైతన్య, బంకురు మహేశ్వరరావు, లంకా ఉమ, తమ్మలాల వంశీ, తదితరులు పాల్గొన్నారు.
- దెందులూరు: ఎన్‌టీఆర్ తెలుగు ప్రజల ఆరాధ్య దైవం అని అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడేటి మోహన్‌బాబు అన్నారు. పోతునూరులో కోనేరు సురేష్, నున్న లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గండి రాజా, తలారి ధన్యకుమార్, పాల్గొన్నారు. గాలాయగూడెంలో ఏనుగు రామకృష్ణ, పూజారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, కొవ్వలి, గ్రామాల్లో ఎన్‌టీఆర్ విగ్రహాల వద్ద వర్ధంతి నిర్వహించారు
- బుట్టాయగూడెం: ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని కొమ్ముగూడెం సెంటరులోని ఎన్టీ రామారావు విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. రెడ్డిగణపవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. మొగపర్తి సోంబాబు, యంట్రప్రగడ శ్రీనివాసరావు, గద్దె అబ్బులు, కుందుల శ్రీను, మానెల్లి బాబు, మాటూరి ముసలయ్య, మడకం రామకృష్ణ, దెయ్యాల కృష్ణమోహన్, మొడియం సూర్యచంద్రరావు, బొబ్బర ఎలీషా, భౌమరాజు ధనుంజయరాజు, చిలకమూడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.
- పోలవరం: టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుంచే దొరబాబు, కుంజం సుభాషిణి, మంగిన కొండ మాట్లాడారు. ఏటిగట్టు సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. జల్లేపల్లి వెంకట నరసింహరావు, ఆకుల రాజా, పోతుల శ్రీనివాస్, మజ్జి అప్పారావు, జల్లేపల్లి సుబ్బారావు, యడ్ల వినోద్, పిల్లి నాగరాజు, బండారు శ్రీనివాసరావు, మాగంటి రాము, కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- జీలుగుమిల్లి: మండలంలో పి.రాజవరం, పి.అంకంపాలెం, రాచన్నగూడెం, ములగలంపల్లి, పాములవారిగూడెం, దర్భగూడెం, కామయ్యపాలెం, జీలుగుమిల్లి గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. పలు చోట్ల ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలిపి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి, నాలి శ్రీను, బి.రాజబాబు, ఉండవల్లి సోమసుందరం, గూడపాటి పుల్లయ్య, యాండ్ర శేఖర్, జాస్తి సత్యనారాయణ, బొలగాని అఖిల్, చీమకుర్తి శ్రీనివాస్, ఆర్.శివాజీ, పూసం అర్జునరావు, తమ్మన సాంబ, పీతల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.
- చింతలపూడి: చింతలపూడి, ప్రగడవరం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. పక్కాల వెంకటేశ్వరరావు, బోడా నాగభూషణం, బొమ్మాజీ అనిల్, సొంగా రోషన్‌కుమార్, చిట్టూరి ధర్మరాజు, మారుమూడి థామస్, యాళ్ల లీలాప్రశాంతి, కొత్తపూడి శేషగిరిరావు, తాటి అప్పారావు, ప్రగడవరంలో తాళ్ళూరి చంద్రశేఖర రెడ్డి, రాజశేఖరరెడ్డి, వీర్రాజు, కొప్పెర్ల నాగరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కామవరపుకోట: కొత్తూరులో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కిలారు సత్యనారాయణ, ఘంటా సుధీర్‌బాబు, ఖాన్ వజీర్, జిజ్జూరి బాబ్జీ, షేక్ వలీ, దొడ్డాకుల గంగాధరరావు, బొబ్బిలి డాన్ దివాకర్, పరసా శ్రీను, సర్పంచ్‌లు పసుమర్తి పార్థసారధిబాబు, గోరింక దాసు తదితరులు పాల్గొన్నారు. మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో తూతా లక్ష్మణరావు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, పసుమర్తి పార్థసారధిబాబు, గూడపాటి కేశవరావు గోరింక దాసు, తదితరులు పాల్గొన్నారు.
- టి.నరసాపురం: మండలంలోని తెడ్లం, రాజు పోతేపల్లి, బొర్రంపాలెం, ఏపిగుంట గ్రామాలల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు, టి.నరసాపురంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, నల్లూరి వెంకట చలపతిరావు, తోట లక్ష్మీనారాయణ, అద్దంకి జగ్గారావు, జోనుబోయిన సోంబాబు, బండి శ్రీనివాసరావు, పెద్దిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.
- లింగపాలెం: మండలంలో ఎన్టీఆర్ విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు, తాతిన రాధాకృష్ణ, పిల్లల శ్రీనివాస్ యాదవ్, చెన్ను శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.
- కుక్కునూరు: రామాలయం నుంచి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శీలం వెంకటేశ్వరరావు, దాసరి శ్యామ్ చంద్ర శేషు, బొరగం శ్రీనివాసులు, కొండపల్లి రవి, డోకల నాగేశ్వరరావు, ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచుక రాజు పాల్గొన్నారు.
- భీమడోలు: భీమడోలు సంతమార్కెట్, పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దౌలూరి మరియన్న ఆర్థిక సాయంతో 20 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. శిరిబత్తిన కొండబాబు, దోసనపూడి పుల్లయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు: మండలంలోని కైకరం, ఉంగుటూరు, వెల్లమిల్లి, రావులపర్రు, యర్రమళ్ల, ఎ.గోకవరం, నల్లమాడు సీతారాంపురం, తదితర గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజ నేయులు, పాతూరి విజయకుమార్, రెడ్డి చందు, చింతల శ్రీనివాస్, నల్లా ఆనంద్, బండారు మధు, ఇమ్మణ్ణి గంగాధరరావు, కడియాల రవిశంకర్, గంటా యువరాజు, దండమూడి ఉషారాణి, పసుపులేటి నరసింహరావు, ఉన్నమట్ల సునీత, బండి స్వరూప్, అక్కిన నాగమణి, యెగ్గిన శ్యామల తదితరులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం: ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పారేపల్లి రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, చినరాజు, గోపి, శ్రీనివాస్, ఆకుల అరుణ, తదితరులు పాల్గొన్నారు.
- పెదవేగి: ఎన్టీ రామారావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, నంబూరి నాగరాజు, మోరు శ్రావణి, గారపాటి రామసీత, చింతమనేని సతీష్, దేవరపల్లి ఆదామ్ పాల్గొన్నారు.
- నిడమర్రు: ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని టీడీపీ మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి అన్నారు. క్రొవ్విడిలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఉదిసే రాంమూర్తి, అడ్డాడ రఘు, మహ్మద్ గఫ్ఫార్‌ఖాన్, సారికె లెనిన్, యర్రంశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- ద్వారకా తిరుమల: మండలంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ద్వారకా తిరుమలలోఇమ్మడి రత్నాజీ, మారంపల్లిలో లంకా సత్యనారాయణ, పావులూరివారిగూడెంలో పావులూరి మధు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.


కొణికిలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం, బుట్టాయగూడెంలో నివాళి





టి.నరసాపురం, లింగపాలెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

నేటి నుంచి కుల గణన సర్వే

ఏలూరు టూటౌన్, జనవరి 18: నగరంలో ఈ నెల 19 నుంచి కుల గణన సర్వే ప్రారంభిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ గురువారం తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారన్నారు. వలంటీర్లు కూడా కులగణనలో పాల్గొంటారన్నారు. సిబ్బంది వచ్చినప్పుడు ఇంట్లో ఎవరు లేకపోతే నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చి తమ వివరాలు ఇచ్చి కులగణనకు సహకరించాలన్నారు.

- కామవరపుకోట: మండలంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో కుల గణన చేయనున్నట్లు ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. సర్వేలో సమగ్ర కుల ఆధారిత డేటా సేకరించాలని సిబ్బందికి సూచించారు. పూర్తి వివరాలు సేకరించి 28 తేదీలోగా నివేదికలు అందజేయాలని ఆమె తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

పెదవేగి, జనవరి 18: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అన్నారు. సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గ్రామాభివృద్ధి ప్రణాళికపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధులను క్రమపద్ధతిలో ఖర్చుచేయాలని ఆయన సూచించారు. కేవీ.జాన్సన్, ప్రసాద్, కిషోర్, రాణి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని పాదయాత్ర

ఉంగుటూరు, జనవరి 18: చంద్రబాబు సీఎం కావాలని నెల్లూరుకు చెందిన చింతల అశోక్ పాదయాత్ర చేపట్టారు. గురువారం ఉంగుటూరు చేరడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని అతడిని అభినందించారు.

అభ్యుదయవాది డాక్టర్ అంబేడ్కర్

జంగారెడ్డిగూడెం, జనవరి 18: సామాజిక రుగ్మతలు రూపు మాపేందుకు రాజ్యాంగం అనే ఒక ఆయుధాన్ని ఇచ్చిన గొప్ప అభ్యుదయవాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ట్రైనీ కలెక్టర్ పూజా, ట్రైనీ డీఎస్పీ బి.విద్య, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలో గురువారం సామాజిక సమత సంకల్ప ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో ఎ.విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

కొయ్యలగూడెం, జనవరి 18: సామాజిక సమతామూర్తి అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలని ఎంపీపీ గంజిమాల రామారావు పిలుపునిచ్చారు. కొయ్యలగూడెం అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల ప్రజలు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు స్నేహన్, చినబాబు, కిషోర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- లింగపాలెం: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలందరూ తరలిరావాలని ఏపీ స్టేట్ లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిలేటి జయరాజు, ముళ్ళపూడి సుమన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

నిడమర్రు, జనవరి 18: వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షితమని ఎస్ఐ ఆర్.శ్రీను అన్నారు. నిడమర్రు సెంటర్‌లో గురువారం యువకులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా, హెల్మెట్ ధరించడంపై సూచనలు ఇచ్చారు.




లింగపాలెంలో అంగన్వాడీల ర్యాలీ, టి.నరసాపురంలో మాట్లాడుతున్న సీపీఎం నేత, చింతలపూడి సమ్మె శిబిరంలో అంగన్వాడీలు

చర్చల పేరుతో జాప్యం

ప్రభుత్వ తీరుపై అంగన్వాడీల ఆగ్రహం

పోలవరం, జనవరి 18: అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చర్చల పేరిట జాప్యం చేస్తుందని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి అన్నారు. అంగన్వాడీల సమ్మె గురువారం 38వ రోజుకు చేరింది. ప్రభుత్వం ఒక వైపు చర్చలంటూ మరోవైపు అంగన్వాడీలకు నోటీసులు ఇచ్చి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకి వ్యతిరేకంగా అంగన్వాడీలపై దీక్షలపై అణచివేత చర్యలు చేయడం దుర్మార్గమని, నోటీసులు ఇచ్చి విధులకు హాజరుకాకపోతే తొలగిస్తామని బెదిరింపులకు దోరణులకు పాల్పడడం ప్రభుత్వానికి తగదన్నారు. చెరుకూరి మణి, పద్మ, సరస్వతి, హైమవతి, కుబ్రా, జుబేద, వెంకటరమణ, సత్యవతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

- లింగపాలెం: అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అంగన్వాడీలపై వివక్షత చూపుతోందన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే సామూహిక ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామన్నారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేఎస్ కుమారి, వి.ఈశ్వరి, మండలంలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.
- చింతలపూడి: అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 38వ రోజు స్థానిక నిరసన శిబిరంలో భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు. మొక్కవోని దీక్షతో తమ సమస్యల కోసం పోరాడుతున్న కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ నాయకులు అరుణ, హేమలత, శాంతి కోరారు. విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలతో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే రాబోయే కాలంలో ఉద్యమం మరింత తీవ్రమవుతుందన్నారు.
- టి.నరసాపురం: అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా పట్టు విడవకుండా సమ్మె చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెల్లం రామకృష్ణ, అనుమోలు మురళి, మడకం సుధారాణి, మడకం కుమారి తదితరులు పాల్గొన్నారు.
- కుక్కునూరు: సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని అంగన్వాడీలు అన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు సీపీఎం ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. సీఐటీయూ నేత సాయికిరణ్, రాయి రమణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘీభావం

ఏలూరు ఎడ్యుకేషన్: అంగన్వాడీల పోరాటానికి ఏపీఎన్‌హెచ్‌ఎం జేఏసీ సంపూర్ణ మద్దతునిస్తోందని జేఏసీ రాష్ట్ర చైర్మన్ దయామణి గురువారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో పనిచేస్తున్న అంగన్వాడీలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు పనిచేస్తున్నారని, వీరిపై రాష్ట్ర ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతోందని ఆరోపించారు. పోరాటాన్ని ఉధృతం చేసే క్రమంలో అంగన్వాడీలు ఈ నెల 20న చేపట్టిన రాస్తారోకో, ర్యాలీల్లో జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులందరూ సంఘీభావంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వారు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలకు కూడా మద్దతుగా నిలవాలని కోరారు. ఇప్పుడు అంగన్వాడీల పోరాటానికి మద్దతుగా నిలబడకపోతే భవిష్యత్తులో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు కూడా ఇదే దుస్థితి ఎదురయ్యే అవకాశం లేకపోలేదని దయామణి హెచ్చరించారు.

పేదల ఇళ్లకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ రూ.2.98 కోట్లు

ఏలూరు సిటీ, జనవరి 18: జిల్లాలో పేదలందరికీ ఇళ్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్ 22,244 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.98 కోట్లు నగదు జమ చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం జగన్ గురువారం బటన్ నొక్కి జమ చేశారు. కలెక్టరేట్ నుంచి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, హౌసింగ్ డైరక్టర్ ఘంటా సంధ్య, హౌసింగ్ పీడీ కేవీఎస్ఆర్ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఇంటి నిర్మాణానికి ఇచ్చే నగదుతో పాటు స్వయం సహాయక సంఘాల్లో మహిళలందరికీ ప్రభుత్వం అదనపు రుణాలు మంజూరు చేస్తోందని, ఆ రుణాలపై వడ్డీ ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తోందన్నారు. స్వయంసహాయక సంఘాల ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

భార్యను గాయపరిచిన భర్తపై కేసు

జంగారెడ్డిగూడెం, జనవరి 18 : భార్యపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. కేతవరం గ్రామానికి చెందిన బి.గంగరాజు, చంద్రవతి ఈ నెల 16న గొడవపడ్డారు. గంగరాజు కర్రతో భార్య చంద్రావతిని కొట్టడంతో గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కర్రీ పాయింట్‌లో అగ్నిప్రమాదం

భీమడోలు, జనవరి 18: భీమడోలు జంక్షన్‌లోని కర్రీ పాయింట్‌లో గ్యాస్ లీకై గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కొణతల వాణి, గోరింకల అప్పోశమ్మ, దౌలూరి శేషమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఏలూరు, భీమడోలు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.80 వేల ఆస్తిన నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

సంక్షిప్త సమాచారం..

- **జంగారెడ్డిగూడెం :** ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేరంపేటకు చెందిన పల్లి శ్రీనివాసరెడ్డికి వెంకట రామానుజపురంలో పొలం ఉంది. పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈనెల 14న గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, రాగివైరును చోరీ చేశారు. రైతు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.
- జంగారెడ్డిగూడెం రాముడు కుంట చెరువు ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఒకరిని అరెస్టు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెండు కోళ్లు, 2 కోడి కత్తులు, రూ.110 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.
- **పెదపాడు :** ఏలూరు గౌడ సేవా సమితి ద్వారా ప్రతి నెలా రెండు కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు బైగాని రంగారావు తెలిపారు. పెదపాడు మండలం వేంపాడు గ్రామానికి చెందిన చిట్టిమాది సాయిప్రసాద్ కిడ్నీ వ్యాధితో మరణించగా, వారి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు, అమ్మపాలెంకు చెందిన బాలిన సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులకు కూడా రూ.20 వేలు అందజేశారు. మారగాని శ్రీనివాస్, పరస శ్రీనివాస్ పాల్గొన్నారు.
- తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త తుళ్లూరి డొమినిక్ గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే చింతమనేని డొమినిక్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గుత్తా అనిల్, బొప్పన సుధా, గారపాటి రామసీత, కొత్తూరు చినబాబు, అక్కినేని వంశీకృష్ణ, తదితరులున్నారు.
- **కామవరపుకోట :** గ్రామంలోని షిరిడీ సాయి మందిరం, పాతూరు రోడ్డులో షిరిడీ సాయి ఆలయం వద్ద గురువారం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్న సమారాధన నిర్వహించారు. బాబాకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక హారతులు ఇచ్చారు. బాబా భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సంక్షేమ ఆద్యుడు ఎన్టీఆర్



ముదినేపల్లి నుంచి మోటార్ బైక్‌లపై గుడివాడ వెళ్తున్న నేతలు

'రా కదలిరా' సభకు తరలిన నేతలు

ముదినేపల్లి, జనవరి 18 : గుడివాడలో గురువారం జరిగిన 'రా కదలిరా' చంద్రబాబు సభకు మండలం నుంచి టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తొలుత అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు, అభిమానులు రావటంతో ముదినేపల్లి పసుపుమయమైంది. వీరమల్లు నరసింహారావు, కొత్తూరు విఠల్, చలసాని జగన్మోహనరావు, కందేపి పద్మ, పరసా విశ్వేశ్వర రావు, బొంగు రవికుమార్, దావు నాగరాజు నాయకత్వం వహించారు. వీరంకి వెంకటేశ్వరరావు, మోటేపల్లి హనుమ, పోకల దేవేంద్ర కృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు గుడివాడ సభకు తరలివెళ్లారు.

● కలిదిండి: గుడివాడ సభకు కలిదిండి నుంచి నాయకులు, కార్యకర్తలు కార్లు, బైకులపై భారీగా తరలివెళ్లారు. వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, భోగేశ్వర రావు, అంద్రాజు శ్రీనివాస్, రెడ్డి చక్రవర్తి, వాతాడి రాంబాబు, సురేష్, బందుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● కైకలూరు: కైకలూరు, మండవల్లి మండలాల నుంచి భారీ ఎత్తున టీడీపీ నేతలు గుడివాడ తరలివెళ్లారు. పెన్మెత్స వెంకటేశ్వరరాజు, కమ్మిలి విఠలరావు, త్రినాధరాజు, నారగాని వీరవెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నేతలంతా బైకులు, కార్లపై ర్యాలీగా వెళ్లారు.

● ముదినేపల్లి రూరల్: తెలుగుదేశం పిలుస్తోంది రా కదిలిరా గుడివాడలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కొడాలి వినోద్ పెదపాలపర్రు నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు.



కలిదిండి నుంచి చంద్రబాబు సభకు..



దేవినేని ధలరాంను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికల్లో భారీ మెజార్టీకి కృషి: ధలరాం

ముసునూరు, జనవరి 18: టీడీపీ మండల అధ్యక్షులు దేవినేని ధలరాంను గురువారం ఆ పార్టీ నాయకులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎనిమిది నెలల క్రితం అమెరికాకు వెళ్లి రెండు రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగివచ్చారు. ఇప్పటివరకు మండల అధ్యక్షుడి బాధ్యతలు ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య నిర్వర్తించారు. ఈ సందర్భంగా ధలరాం మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో మండలంలో భారీ మెజార్టీ వచ్చేలా సమిష్టిగా కృషి చేస్తామని చెప్పారు.

కేంద్ర పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆగిరిపల్లి, జనవరి 18: పేదప్రజల సంక్షేమానికి కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని రాజ్యసభ సభ్యులు ఠాగూర్ పేర్కొన్నారు. ఈదరలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. తొలుత వివిధశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఏలూరు జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్ సుబ్బారావు, దొండపాటి అనిత, గోళ్ళ అనూష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఠాగూర్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జయప్రదం చేయాలి

ముదినేపల్లి, జనవరి 18 : విజయవాడ స్వరాజ్య మైదానంలో శుక్రవారం జరగనున్న బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగజగన్ బాబూరావు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల విజయ కుమార్, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసుపోగు దానియేలు కోరారు.

నూజివీడు టికెట్ బీసీలకు కేటాయించాలి

ఆగిరిపల్లి, జనవరి 18: సార్వత్రిక ఎన్నికల్లో నూజివీడు అసెంబ్లీ వైసీపీ టికెట్ బీసీలకు ఇవ్వాలని జడ్పీటీసీ మాజీ సభ్యులు కాజా రాంబాబు కోరారు. గత 20 ఏళ్లుగా ఒకే సామాజిక వర్గానికి టికెట్ ఇస్తున్నారని, దీంతో బీసీ కులాలు ఎదగటం లేదన్నారు. సామాజిక సాధికార యాత్రలు చేస్తున్న వైసీపీ ఈ సారి బీసీలకు సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఫణీంద్ర కుటుంబసభ్యులకు కామినేని పరామర్శ

కలిదిండి, జనవరి 18 : అనుమానాస్పద స్థితిలో ఇటీవల మృతి చెందిన కోకా ఫణీంద్ర కుటుంబసభ్యులను మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. గ్రామాల్లో ఇలాంటి సంఘటన దురదృష్టకరమన్నారు.

వర్ధంతి సభలో నేతల ఘననివాళి

నూజివీడు, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీ రామారావు వర్ధంతిని గురువారం నియోజకవర్గంలో నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నూజివీడు ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముద్దరబోయిన మాట్లాడుతూ, సంక్షేమం అంటే దేశానికే తలమానికంగాచేసిచూపిన ఘనుడు ఎన్టీఆర్ అన్నారు. చెరుకూరి దుర్గాప్రసాద్, మల్లిశెట్టి జగదీష్, కోటగిరి శ్రీనివాస్, మోరంపూడి శ్రీనివాస్, వాకా రాజ్‌కుమార్, ముసునూరు రాజా, జగ్గవరపు వెంకటరెడ్డి, అరికోటి సంగీతరావు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్: తెలుగువాడి ఉనికిని ప్రపంచానికిచాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని నూజివీడు మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు అన్నారు. రావిచర్లలో ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. పర్వతనేని గంగాధర్, పౌల్‌రాజు, లావుప్రసాద్, సాంబశివరావు, అక్కినేని చందు పాల్గొన్నారు. బత్తులవారిగూడెం, తూర్పుదిగవల్లి గ్రామాల్లో మండల అధ్యక్షులు ముసునూరి రాజా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ముసునూరి లక్ష్మీకాంతమ్మ, మందాడి తిరుపతిరావు, జి.పూర్ణచంద్రరావు, దాకారపు వెంకటరత్నం, జగ్గవరపు వెంకటరెడ్డి, జె.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చాట్రాయి: పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ కల్పించాలనే ఆశయంతో దేశంలోనే మొట్టమొదటి సారిగా సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన ఎన్టీఆర్ నిజమైన ప్రజాసేవకుడని నూజివీడు నియోజకవర్గ నేత పర్వతనేని గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, మండల అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, తెలుగురైతు నేత అక్కినేని చందు కొనియాడారు. చాట్రాయి కొత్తపేట, పోలవరం, చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబటి చంటి, కమ్ముల కొండలరావు, చెన్నారావు, లక్ష్మణరావు, సత్యనారాయణ, పుల్లారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, చలసాని జగన్మోహనరావు, కొత్తూరు విఠల్, పరసా విశ్వేశ్వరరావు, ఈడ్పుగంటి శ్రీనివాస్, బొంగు రవికుమార్, పరసా కనకారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరులో దావు నాగరాజు, యర్రా రాంబాబు నివాళులర్పించారు. చేవూరు, ములకలపల్లి, కాకరవాడ గ్రామాల్లో కూడ ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. బొప్పన సుందర రామయ్య, వీరమల్లు సత్యనారాయణ, పంతగాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి: మండల కేంద్రం ఆగిరిపల్లిలో టీడీపీ స్థూపం వద్ద ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కొండా మంగయ్య, మాదల సత్యకుమార్, ముల్లంగి శ్రావణ్ కుమార్, బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కలిదిండి: మండల కేంద్రమైన కలిదిండి, పడమటిపాలెం, ఎస్.ఆర్పీ అగ్రహారం, కొండంగిల్లో నేతలు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అంద్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, తేరా రమేష్, కురేళ్ల ఏడుకొండలు, భట్రాజు ఏసుబాబు, నున్న సుబ్రహ్మణ్యం, జాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

● కైకలూరు: తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంపొందించిన మహోన్నతుడు ఎన్టీఆర్ అని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. తాలుకా సెంటర్, కోరుకొల్లు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికి అమలవుతున్నాయన్నారు. పెన్మెత్స వెంకటేశ్వర రాజు, త్రినాధరాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, పూల రామచంద్రరావు, పోలవరపు లక్ష్మీరాణి, శీలం కృష్ణవేణి, పడమటి వాసు, వేములపల్లి కారుణ్య, పళ్ళెం తాతారావు, పామర్తి రాంబాబు, ఉస్మాన్, లక్కింశెట్టి మోహన్, గాలి ప్రసాద్, వీరాబత్తిన సుధా పాల్గొన్నారు. శృంగవరప్పాడులో ఎన్టీఆర్ విగ్రహానికి బలే ఏసురాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైదు వెంకటేశ్వరరావు, జయరాజు, శ్రీరామరాజు, బలే రామయ్య, జయమంగళ సుబ్బరాజు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

● మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీ విగ్రహాలకు టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు. భైరవపట్నంలో ఎన్టీఆర్ విగ్రహానికి చాపరాల దుర్గాప్రసాద్, బొల్లంపల్లి కృష్ణారావు, సబ్బా బాబి, పవన్ పూలదండలు వేసి నివాళులర్పించారు.

● ముదినేపల్లి రూరల్: పెదపాలపర్రులో ఎన్టీఆర్ విగ్రహానికి చళ్ళగుళ్ళ శోభనాద్రిచౌదరి, గంట రాకేష్ కుమార్ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.





నూజివీడు, చాట్రాయిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముద్దరబోయిన, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

బడుగు వర్గాల ఆశాజ్యోతి..

ముసునూరు, జనవరి 18: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఏనలేని కృషిచేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ మండల అధ్యక్షులు దేవినేని ధలరాం అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతిని గురువారం మండలంలో నిర్వహించారు. ముసునూరులో ధలరాం, గుడిపాడులో గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, గుళ్ళపల్లిలో వలసపల్లి రామమోహనరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గోపవరం ఏస్సీకాలనీ, నాగేంద్రపురంలో ఎన్టీఆర్ విగ్రహాలకు బొల్లినేని బుజ్జియ్య, మాకినేని నాగర్జున, పర్వతనేని శ్రీనివాసరావు, ఉండవల్లి ధర్మరాజు, నందిగం దామోదరావు, కర్ర ఏసుపాదం, గోధుమ వెంకటేశ్వరావు, సాయిల జగ్గయ్య, బళ్ళవరపు రెడ్డియ్య, ఉప్పలపాటి గణేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెక్కపల్లి, బసవరపుపాడు గ్రామాల్లో పర్వతనేని గంగధరరావు, కాట్రేనిపాడులో మొక్కపాటి బుజ్జియ్య, గద్దల మోహన్‌రావు, రావర్ల బాలకృష్ణ, రావర్ల ప్రతాప్, గూడపాటి అజయ్‌కుమార్ నివాళులర్పించారు. పలు గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు.



గోపవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు



ఆగిరిపల్లిలో..









ముదినేపల్లి, కలిదిండి, కైకలూరు, మండవల్లి మండలం భైరవపట్నంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు ప్రణాళికలు అవశ్యం

ముదినేపల్లి, జనవరి 18 : పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికా బద్ధమైన కార్యాచరణ రూపొందించాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. స్థానిక మండల కార్యాలయంలో గురువారం 2024 -25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల ప్రణాళికల రూపకల్పనపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షన కార్యక్రమం నిర్వహించారు. ఆదాయ వనరులు, నిధుల అంచనాలతో పనుల ప్రణాళికను రూపొందించాలన్నారు. ఎంపీడీవో పి.మల్లేశ్వరి, ఏవో రమణ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ సత్యనారాయణ

ముసునూరు, జనవరి 18: పంచాయతీల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషిచేయాలని ఈవోపీ ఆర్డీ బి.ఎ.సత్యనారాయణ అన్నారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై రెండవ రోజు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారు లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. చేపట్టాల్సిన పనులు, నిధులు తదితర వాటిపై తయారు చేసే ప్రణాళికలకు సంబంధించిన నిబంధనలను ఈవోపీఆర్డీ వివరించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, కె.సాయిరాము తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ఆగిరిపల్లి, జనవరి 18: ఈదులగూడెంలో ఈలప్రోలు తాతబ్బాయి గోపీచంద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను గురువారం ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ప్రారంభించారు. చిట్నేని రామ్మోహన్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రవీణ్ అందించిన స్థలంలో వాటర్‌ప్లాంట్ నిర్మించారు. ఐదు రూపాయలకే వాటర్ క్యాన్ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిట్నేని శివరామకృష్ణ, ఈలప్రోలు శ్రీనివాసరావు, కొండసాని సీతారామయ్య, దండిబోయిన ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేత 'కాళ్లపాలెం'

కలిదిండి, జనవరి 18 : రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో కాళ్లపాలెం మేడిశెట్టి వెంకటరత్నం జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఆకివీడులో ఈ నెల 15, 16, 17 తేదీల్లో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానం సాధించిన కాళ్లపాలెం జట్టుకు రూ.25 వేలు నగదు, షీల్డ్‌ను ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ అందజేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, చందన ఉమామహేశ్వరరావు, బొర్రా సత్యవతి, పేటేటి స్వర్ణ కుమారి, రామకృష్ణ జట్టు సభ్యలను గురువారం అభినందించారు.



బహుమతులతో జట్టు కెప్టెన్



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో దుర్గాప్రసాద్

హోరాహోరీగా ఆటల పోటీలు

చాట్రాయి, జనవరి 18: స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి ఆటల పోటీలు హోరాహోరీగా జరిగాయి. 16 సచివాలయాల నుంచి 48 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో జట్లు తలపడ్డాయి. శుక్రవారం విజేతలు ఎవరో తేలనున్నది. ఎంపీడీవో దుర్గాప్రసాద్, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, సతీష్‌కుమార్, ప్రభాకరరావు, విజయ్, వెంకట్ పాల్గొన్నారు.

22న శ్రీరామరథ యాత్ర

ముదినేపల్లి, జనవరి 18: అయోధ్యలో రామాలయం ప్రతిష్ఠోత్సవం సందర్భంగా ఈ నెల 22న ముదినేపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామరథ యాత్ర జరుగుతుందని పరిషత్ ప్రతినిధి వత్తుమిల్లి సత్యప్రసాద్ తెలిపారు. స్థానిక సీతారామచంద్రస్వామి దేవస్థానం నుంచి రథయాత్ర ప్రారంభమౌతుందన్నారు.

యోగ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆగిరిపల్లి, జనవరి 18: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా స్థానిక హోమియో వైద్యశాలలో యోగ శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ రజిత గురువారం ఓ ప్రకటనలో కోరారు. పీజీ లేదా డిప్లొమా కోర్సు చేసిన అభ్యర్థులు అర్హులని, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వివరాలకు 96700 78795 సంప్రదించాలన్నారు.



వేదాంతంను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

అర్థశాస్త్ర అధ్యాపకునికి డాక్టరేట్

కైకలూరు, జనవరి 18: స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న బి. వేదాంతంకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 'ఉప్పునీటిలో రొయ్యల సాగుపై ఆర్థిక విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన చేసి థీసిస్ సమర్పించారు. దీనిని పురస్కరించుకుని గురువారం ఆయనను కళాశాలలో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ బి. రఘునాధరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాశ్, ఐక్యూ కోఆర్డినేటర్ జాలబాబు, అధ్యాపకులు నున్న శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

కలిదిండి, జనవరి 18 : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మట్టగుంటలో గురువారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. వీరబ్రహ్మం, బళ్ల రాజు, పరశురాముడు, కృష్ణ, వెంకటరమణ, చిన్నికృష్ణ, విష్ణు, రామారావు పాల్గొన్నారు.

నిరాహార దీక్షలకు విజయవాడ తరలిన అంగన్‌వాడీలు

ముదినేపల్లి, జనవరి 18 : నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ ఉద్యోగులు విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టిన నిరాహార దీక్షలకు గురువారం మండలం నుంచి కార్యకర్తలు, సహాయకులు తరలివెళ్లారు. సూరపనేని అరుణ కుమారి, సౌంగా మణి, బండి పద్మ, రిబ్ పా నాయకత్వం వహించారు.

● నూజివీడు టౌన్: డిమాండ్ల సాధనకోసం నిరవధిక సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలు విజయవాడ తరలివెళ్లారు. అయితే నిషేధాజ్ఞల పేరుతో అంగన్‌వాడీలను వెళ్లకుండా నిలువరించే పరిస్థితి ఉండటంతో ఎవరికి వారుగా వ్యక్తిగత పనుల పేరుతో సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదు

ఏలూరు టూటౌన్, జనవరి 18: బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదని మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు అలగా రవికుమార్ అన్నారు. మాల మహాసేన కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వ హించారు. రవికుమార్ మాట్లాడుతూ దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ దళితులను దారుణంగా మోసం చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన 27 దళిత సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. వాటిని తిరిగి ప్రారంభి స్తేనే జగన్‌కు విగ్రహాన్ని ప్రారంభించే అర్హత ఉందన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పేరును తొలగించి జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చుకుని అహంకారాన్ని చాటు కున్నాడన్నారు. కార్యక్రమంలో ఏడుకొండలు, పెద్దిరాజు, ఎన్.శంకర్, కె.దిలీప్, బద్రి, కే.రాజేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాలుడిపై పాస్టర్ దాడి.. కేసు నమోదు

ఆగిరిపల్లి, జనవరి 18: ఆడుకొంటున్న ఓ బాలుడిని పాస్టర్ గాయపరిచినట్టు అందిన ఫిర్యాదుపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. ఈదులగూడెంకు చెందిన ఐయ్యంకి జోయల్‌బాబు(12) స్నేహితులతో కలిసి ఆర్సీఎం చర్చి వద్ద ఖాళీ స్థలంలో వాలీబాల్ ఆడుకుంటున్నాడు. బాలు తీసుకొచ్చేందుకు సమీపంలో చెట్టుకు కట్టేసిఉన్న పాస్టర్ మన్నెం శరత్ పెంపుడుకుక్క దగ్గరకు వెళ్లాడు. పాస్టర్ రాళ్లు విసరగా స్నేహితులంతా పారిపోయారు. సైకిల్ తెచ్చుకునేందుకు వెళ్లిన జోయల్‌బాబును పాస్టర్ కర్రతో కుడిచేతిపై బలంగా కొట్టడంతో గాయపడ్డాడు. బాధితుడి తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు. నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతున్నాడు.

జనసేన నేత కారుపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

కైకలూరు, జనవరి 18: జనసేన పార్టీ కైకలూరు నియోజకవర్గ నేత కొల్లి వరప్రసాద్ (బాబి) కారును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం రాత్రి కైకలూరులోని ఆయన ఇంటి ముందు కారు పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారుపై దాడి చేసినట్లు గుర్తించి కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



జామాయిల్ ట్రాక్టర్ బోల్తా- వ్యక్తికి తీవ్ర గాయాలు



చాట్రాయి, జనవరి 18: జామాయిల్ కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ గురువారం రాత్రి చాట్రాయి ఊరచెరువు దగ్గర బోల్తా పడటంతో కర్రలు మీదపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి. పామాయిల్ కర్రల లోడుతో ట్రాక్టర్ చాట్రాయి వైపు వస్తుండగా, అదే సమయంలో బచ్చు శరన్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఆరుగొలనుపేట వెళుతున్నాడు. ట్రాక్టర్ బోల్తాకొట్టి కర్రలు శరన్‌పై పడ్డాయి. వెంటనే స్థానికులు స్పందించి కర్రలు తొలిగించి శరన్‌ను బయటకు తీసి 108లో నూజివీడు ఆసుపత్రికి తరలించారు. పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు కర్రలు తగలటంతో సరఫరా నిలిచిపోగా ఆ తరువాత పునరుద్ధరించారు. ట్రాఫిక్ నిలిచిపోవటంతో ఎస్ఐ కెసిహెచ్. స్వామి సిబ్బందితో వచ్చి క్లియర్ చేశారు.

బాగుపడని బతుకులు!

పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ నీటిపై రాతలా మారింది. అధికారంలోకి వస్తే తమ బతుకులు బాగుపడతాయని ఆశించిన పంపు మెకానిక్‌లకు ఆశాభంగం కలిగింది. కనీస వేతనం అందక, ఉద్యోగ భద్రత లేక పిల్లాపాపలతో అష్టకష్టాలు పడుతున్నారు. కార్మిక చట్టం పాలకులకు చుట్టంగా మారడంతో ఆయా కుటుంబాలు వీధినపడే పరిస్థితి నెలకొంది.

- కనీస వేతనాలు లేక చేతిపంపు మెకానిక్‌ల అవస్థలు
- వర్తించని కార్మిక చట్టం
- ఉద్యోగ భద్రత కరవు
- పట్టించుకోని ప్రభుత్వం

చాట్రాయి, జనవరి 18: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి బోరు పంపులను (చేతిపంపులు) నిత్యం మరమ్మతులు చేస్తూ ప్రజల దాహార్తి తీరుస్తున్న మెకానిక్‌లు జీవితాలు పాతికేళ్లుగా ఎదుగు బొదుగు లేకుండా ఉన్నాయి. మూడు నెలలకు ఒకసారి వచ్చే అరకొర జీతాలు.. ఉద్యోగ భద్రత లేక పలు అవస్థలు పడుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం రూ. 21 వేలు ఇస్తుండటంతో కుటుంబ పోషణ సక్రమంగా జరగక, పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఏలూరు జిల్లా పరిధిలో 60 మంది పంపు మెకానిక్‌లు పనిచేస్తుండగా, వీరికి కార్మిక చట్టం ప్రకారం పీఎఫ్, జీపీఎఫ్, ఈఎస్ఐ సేవలు దక్కడం లేదు. ఉద్యోగ విరమణ అనంతరం ఒక్క రూపాయి కూడా పరిహారం పొందలేని దుస్థితిలో ఉన్నారు. విధి నిర్వహణలో చనిపోయినా బీమా సదుపాయం లేక కుటుంబాలు వీధినపడే పరిస్థితి ఉందని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30, 35 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి ఉద్యోగ విరమణ తరువాత ఎటువంటి ఆర్థికసాయం, పింఛన్ సదుపాయం కల్పించటం లేదని వాపోతున్నారు. తమకు కనీస వేతనాలు ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్‌ను వేడుకోగా, అధికారంలోకి రాగానే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లయినా పట్టించుకోలేదని అన్నారు.

ప్రజల దాహార్తి తీరుస్తున్న తమకు ఉద్యోగ భద్రతతో పాటు , కనీస వేతనాలు, కార్మిక చట్టం ప్రకారం ఇతర సదుపాయాలు కల్పించాలని పంపు మెకానిక్‌లు వేడుకుంటున్నారు.



బోరు చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు